తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# సింహ వాహనంపై సిరులొలికే... శ్రీ మహాలక్ష్మి

- భారీ వర్షం నేపథ్యంలో ఊరేగింపు రద్దు
- మండపంలోనే భక్తులకు దర్శన భాగ్యం





తిరుచానూరు, నవంబర్ 30, ప్రభాతవార్త: సింహవాహనంపై సిరులొలికే శ్రీ మహాలక్ష్మి భక్తులను అనుగ్రహించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శనివారం రాత్రి సింహ వాహనంపై యోగ నరసింహుడు అలంకారంలో శ్రీ పద్మావతి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. తుఫాన్ నేపథ్యంలో వాహన మండపంలోనే భక్తులు అమ్మవారిని సేవించుకున్నారు. ఇందులో బాగంగా అమ్మవారి ఉత్సవర్లను వాహన మండపంకు వేంచేపు చేసి సర్వాంగ సుందరంగ అలంకరించారు. స్వర్ణ అలంకార శోభితురాలైన శ్రీ మహాలక్ష్మిని యోగ నరసింహుణి అలంకారంలో పరాక్రమానికి,శీఘ్ర గమనానికి ప్రతీక అయిన సింహవాహనంపై కొలువు దీర్చారు. వర్షం నేపథ్యంలో తిరు వీధులలో ఊరేగింపు తితిదే రద్దు చేయడంతో వాహన మండపం వద్దే అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

పెద్ద సంఖ్యలో అమ్మవారు భక్తులు కర్పూర నీరాజనాలతో ఆమె కృపాకటాక్షాలకు పాత్రులైనారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఈవో శ్యామల రావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబు స్వామి, ఏవియస్ఓ సతీష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తీర ప్రాంతం... అతలాకుతలం

-ఫెంగల్ తుఫాన్‌తో బీభత్సవం
-వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలు
-పొంగుతున్న వాగులు, వంకలు

సూళ్లూరుపేట, నవంబర్ 30 ప్రభాతవార్త : ఫెంగల్ తుపాను ప్రభావంతో సూళ్లూరుపేటలో గత రెండురోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం అత్యంత భారీగా ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం ఎడతెరిపి లేకుండా మధ్యాహ్నం వరకు కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పట్టణంలోని ఆర్అండ్‌బి రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు మరమ్మతులకు గుంటలు తవ్వి ఉండటంతో ఈ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కమిషనర్ చిన్నయ్య స్పందించి జెసిబి సహాయంతో కచ్చా కాలువల ద్వారా రోడ్లపై నిలిచిన నీరు వెలుపలికి వెళ్లేందుకు ప్రయత్నాలు చేశారు. తహశీల్దార్ ఎస్వి నరసింహారావు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన వత్రపాలెం, గణపతినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వర్షపు నీరు ఇళ్లలోకి ప్రవేశించి ఉండటాన్ని గమనించారు. ఉధృతి మరింత ఎక్కువయితే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. వర్షం ప్రభావంతో నెల్లూరు, చెన్నై నుంచి వచ్చే బస్సులు ఆలస్యంగా నడిచాయి. పట్టణంలోని బాపూజీ కాలనీ, సంజీవయ్య నగర్, ఇందిరా నగర్, సూళ్లూరు ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. అక్కడక్కడా చెట్లు విరిగి రోడ్లకు అడ్డంగా పడిపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో రైతులు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు.


జిఎన్‌టి రోడ్డుపై భారీగా వర్షపునీరు

## నాయుడుపేటలో కుండపోత వర్షం....


బిసివసతి గృహల్లోనికి చేరిన వర్షపునీరు

తుపాన్ ప్రభావంతో నాయుడుపేట మండలంలో శనివారం కుండపోత వర్షం కురుస్తుంది. ఈ వర్షానికి వసతి గృహలు-లోతట్టు ప్రాం తాల్లో ఉన్న ప్రజల నివాసాల్లోనికి వర్షపునీరు చేరడం తో విద్యార్థులు,పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. నాయుడు పేటలో ఉదయం నుండి ఎడతెరపిలేని వర్షం కురవడంతో ప్రజలు ఇంటినుండి బయ టకు రాలేక ఇంటికే పరిమితమైయ్యారు. లోతువానిగుంటలో ఉన్న బిసి బాలుర వసతిగృహం చుట్టు అడుగులోతు వర్షపునీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా నాయుడుపేట పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజల ఇంట్లోనికి వర్షపునీరు చేరడంతో వారి బాదలు వర్ణాతీర్ధంగా మారుతున్నాయి. పట్టణంలో డ్రైనేజి కాలువలు అస్థవ్యస్థంగా ఉండటంతో కురుస్తున్న వర్షాలకు వర్షపునీరు రోడ్డుపైకి చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

తుపాన్ ప్రభావంతో కురు స్తున్న భారీవర్షాలకు స్వర్ణముఖి-మామిడి కాలువలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. గ్రామాల్లో వాగులు, వంకలు,కలుజు కాలవల్లో వర్షపునీరు ప్రవహిస్తుంది. చెరువులు, గుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. గ్రామాల్లో రోడ్లు, వీధులు బురదమయంగా మారుతున్నాయి. కురుస్తున్న వర్షాలకు జాతీయ రహదార్లు సైతం గుంటలుపడి అధ్వానంగా మారుతున్నాయి.

## కోటలో భారీ వర్షాలు...

జిల్లాకు తుఫాన్ ముప్పు పొంచి ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాగం అప్రమత్తమైంది. ఆమేరకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులకు దిశనిర్దేశం చేశారు. శనివారం కోట మండల తహశీల్దార్. కె.జయజయరావు అన్నీ శాఖల అధికారులు అప్రమత్తం చేసి గ్రామాల్లో ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్న లోతట్టు ప్రాంతా ల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. మత్స్యకారులను వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. నీటిపారుదలశాఖ ఇంజినీర్లు, చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని కోరారు.ఈ సమావేశంలో డిప్యూటి తహిశీల్దార్ అంజమతులాఖాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బ్యారేజీని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

వాకాడు, నవంబర్ 30 ప్రభాతవార్త : తుఫాన్ ప్రభావంతో శనివారం నుండి ఏకధాటిక కురుస్తున్న భారీ వర్షంకు బ్యారేజ్‌ను గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పరిశీలించారు. బ్యారేజ్ వద్ద సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఇరిగేషన్ డి.ఈ.ఆనంద్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యారేజ్ నందు నీరు ఎక్కువగా ఉండడంతో బ్యారేజ్ గేట్లు ఎత్తేమని దీంతో బ్యారేజ్ లో ఉన్న నీరు ఆ గేట్లు ద్వారా సముద్రానికి వెళుతుందని తెలిపారు. అదేవిధంగా వాకాడు చెరువు, కల్లూరు చెరువులను సబ్ కలెక్టర్ పరిశీలించారు. తాసిల్దార్ రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణ రావు ల ద్వారా మండలంలోని సమస్యలను తెలుసుకున్నారు. ముంపు ప్రాంతాలను అప్రమత్తంగా చేయాలని మండల స్థాయి అధికారులకు సబ్ కలెక్టర్ సూచించారు. తుఫాను ప్రభావంతో కురు స్తున్న భారీ వర్షాలకు ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణం నష్టం జరగకూడదని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట తాసిల్దార్ రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఇరిగేషన్ డిఈ ఆనంద్, ఏఈ కృష్ణయ్య, శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, మండల రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.


బ్యారేజ్ వద్ద సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

# తూర్పు మండలాల్లో ఫెంగల్ బీభత్సం

నీట మునిగిన పంట పొలాలు- నేలకొరుగుతున్న బోర్డులు-నిండుతున్న చెరువులు, ప్రాజెక్టులు


నీటితో నిండిన పంట పొలాలు

శ్రీకాళహస్తి,నవంబర్ 30 ప్రభాతవార్త : బంగాళా ఖాతంలో ఏర్పడ్డ ఫెంగల్ తుఫాను తూర్పు మండలాలను వణికిస్తుంది. రెండు రోజులుగా ఎముకలు కొరికే చలితో జనం సతమతమౌ తున్నారు. శనివారం ఉదయం,సాయంత్రం నమోదైన వివరాల మేరకు 80 మి.మీల వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఈ ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాల వల్ల నవంబర్ మాసంలో 332 మి.మీలు సాధారణ వర్షపాతం నమోదు కావాలి. కానీ ఈ ఏడాది ఫెంగల్ తుఫాను ప్రభావంతో కూడా కలుసుకొని కేవలం 212 మి.మీలు నవంబర్ నెలలో నమోదైంది. అయితే రెండు రోజులుగా కురుస్తున్న ముసారతో జన జీవనం స్థంభించింది. అయితే తుఫాను ప్రభావంతో శనివారం సాయంత్రం పరిస్థితి పరిశీలిస్తే పంట పొలాలు నీట మునిగాయి. రోడ్డు పక్కన ఏర్పాటు చేసుకున్న బోర్డులు నేలకొరిగాయి. చలితో జనం తల్లడిల్లి పోతున్నారు. జ్వరాలు, జలుబు దగ్గులతో తల్లడిల్లుతున్నారు.

**నిండుతున్న చెరువులు ప్రాజెక్టులు:**

శ్రీకాళహస్తి నీటి పారుదల సబ్‌డివిజన్ పరిధిలో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి ఎస్ఇ నందగోపాల్ ఇలా వివరించారు. మల్లిమడుగు రిజర్వాయర్‌కు నీరు చేరుతుందని తెలిపారు. శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి ప్రాజెక్టుల్లోకి నీరు చేరుతుంది.ఈ మేరకు అధికారుల బృందం ఎస్ఇతో కలిసి పరిశీలించారు. శనివారం సాయంత్రం వరకు అందిన సమాచారం మేరకు కాళంగి రిజర్వాయర్ సామర్థ్యం 222 ఎంసిఎఫటిలు కాగా 133.60ఎంసిఎఫ్‌టిలు చేరింది. అయితే నాలుగు గేట్లు తీసి నీటిని వదలిపెడుతున్నట్లు వివరించారు. కాగా మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం 181 ఎంసిఎఫ్‌టిలు కాగా సాయంత్రానికి 179 ఎంసిఎఫ్‌టిలు ఉన్నట్లు ఎస్ఇ నందగోపాల్ వివరించారు. కాగా స్వర్ణముఖి నది నిండుగా పారుతుంది. తొండమనాడు చెరువు కలుజు పారుతుంది. స్వర్ణముఖి నదిలోని చెత్తా చెదారం కొట్టుకుపోయింది. లాగ్‌లపై నుంచి నీరు ప్రవహిస్తుంది. ముసారకే తారు రోడ్లు ధ్వంసం అయ్యాయి.


కాళంగి గేట్లు ఎత్తివేత

# హెచ్ఐవి లేని సమాజ ఆవిష్కరణ

- హెచ్ఐవికి మందు లేదు నివారణ ఒక్కటే మార్గం - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి




చిత్తూరు, నవంబర్ 30 ప్రభాతవార్త: హెచ్ఐవికి కచ్చితమైన మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని, 2030 సంవత్సరానికి ఎయిడ్స్ లేని సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శనివారం డిఎంహెచ్ఓ డాక్టర్ డాక్టర్ ప్రభావతిదేవి సంబంధిత శాఖల అధికారులతో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై కన్వర్షన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎయిడ్స్‌పై అప్రమత్తంగా వుండాలని, హెచ్ఐవి అనేది హ్యూమన్ ఇమ్యూనో డిఫికెన్సీ వైరస్(మానవుని శరీరంలో రోగనిరోధకశక్తిని క్షీణింపచేయునది)' ద్వారా వస్తుందన్నారు. హెచ్ఐవి వున్న వారికి వాడిన సిరంజిలు తిరిగి ఉపయోగించినా, హెచ్ఐవి పాజిటివ్ వున్న వారి రక్తం ఇతరులకు ఎక్కించినపుడు, హెచ్ఐవి పాజిటివ్ వున్న గర్భిణీ స్త్రీ నుండి బిడ్డకు వ్యాధి సంక్రమిస్తుంద న్నారు. ఎయిడ్స్‌కు కచ్చితమైన మందు ఏది లేదని నివారణ ఒక్కటే మార్గ మన్నారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తులతో కలిసి భోజనం చేయడం, కరచాలనం చేయడం, వారి పనిముట్లు మనం తాకడం ద్వారా హెచ్ఐవి వ్యాప్తి చెందదన్నారు. హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తులను ఎగతాళి చేసి మాట్లాడిన వైలేషన్ ఆఫ్ రూల్ సెక్షన్ 4 కింద లక్ష రూపాయల వరకు జరిమానా, జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, సంబంధిత ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 4న షార్ నుంచి... పిఎస్ఎల్‌వి సి-59 రాకెట్ ప్రయోగం

- సూర్య పరిశోధనల కోసం ఈసాకు చెందిన ప్రోబా-3 ప్రయోగం




రాకెట్లో అమర్చిన ప్రోబా-3 ఉపగ్రహం

శ్రీహరికోట (తడ), నవంబర్ 30 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ నెల 4న పిఎస్ఎల్‌వి సి-59 రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదికపై ఇప్పటికే అనుసంధానం పనులు పూర్తయ్యాయి. ఈ రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజన్సీకి చెందిన ప్రోబా-3 మిషన్‌ను ప్రయోగిస్తున్నారు. ఈ మిషన్‌లో రెండు ఉపగ్రహాలను అమర్చారు. ఇందులో ఒకల్టర్ శాటిలైట్ (ఓఎస్‌సి), కరోనా గ్రాస్ శాటిలైట్ (సిఎస్‌సి) అనే రెండు ఉపగ్రహాలు ఉన్నాయి. మొదటి దానిని సూర్యకాంతిని లేదా సూర్యరశ్మిని నిరోధించేందుకు రూపొందించిన 1.4 మీటర్ల డిస్క్ కలిగి ఉంది. ఇది 150 మీటర్ల దూరంలో దాదాపు 8 సెంటీ మీటర్ల వెడల్పుతో నీడను సృష్టిస్తుంది. ఈ నీడలోనే కరోనా గ్రాస్ శాటిలైట్ అమర్చినట్లు చెప్తున్నారు. ఇందులో 5 సెంటీమీటర్ల అపర్చర్‌తో కూడిన టెలిస్కోప్ ఉంటుంది. ఈ రెండు ఉపగ్రహాలు ఒకే లైనులో ఏర్పాటు చేశారు. ఈ అమరిక భూమి నుంచి సుమారు 60 వేల కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడ గురుత్వాకర్షణ శక్తి చాలా తక్కువగా ఉండటంతో ఉపగ్రహం స్థిరంగా ఉంటుంది.

**సూర్య పరిశోధనల కోసమే..**

ఇప్పటికే ఇస్రో చంద్రయాన్ లాంటి ప్రయోగాలు చంద్రునిపై పరిశోధనల కోసం ప్రయోగించింది. సూర్య పరిశోధనల కోసం ఆదిత్య ఎల్1ను కూడా ప్రయోగించింది. అయితే ప్రస్తుతం మన ఇస్రో కాకుండా యూరోపియన్ స్పేస్ ఏజన్సీ రూపొందించిన ప్రోబా-3ని మన పిఎస్ఎల్‌వి సి59 రాకెట్ ద్వారా ప్రయోగించనుండటం విశేషం. ఇది ఆకాశంలో కృత్రిమ సూర్య గ్రహణాన్ని సృష్టించేందుకు, సూర్యుడి యొక్క బాహ్య వలయం కరోనాని అధ్యయనం చేసేందుకు ప్రయత్నం. ఇది సవాలుతో కూడిన సాహసోపేతమైన నిర్ణయమని, ఈ ప్రయోగ విజయం తర్వాత మరిన్ని విదేశీ ఉపగ్రహాలను మన రాకెట్ల ద్వారా ప్రయోగించే అవకాశం లభిస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇదిలావుంటే ఈ ప్రయోగానికి సంబంధించి కౌంట్‌డౌన్, ఇతర వివరాలు కీలక సమావేశంలో శాస్త్రవేత్తలు నిర్ణయిస్తారు. ప్రస్తుతానికి 4వ తేదీ సాయంత్రం 4 గంటల పైన ప్రయోగాన్ని జరుపుతామని చెప్తు న్నారు. ఇందుకు సంబంధించి వీక్షకులను ఇప్పటికే ఇస్రో ఆహ్వానించింది. షార్‌లోని గ్యాలరీ నుంచి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు పలువురు ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకుంటున్నారు.

# మరో రెండు రోజుల పాటు... వర్షాలు

- ఫెంగాల్ తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వాన - క్షేత్ర స్థాయి అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్



చిత్తూరు, నవంబర్ 30 ప్రభాతవార్త: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగాల్ తుఫాను తమిళనాడు రాష్ట్రం పాండిచ్చేరి దగ్గర కారైకాల్, మహాబలిపురం తీరాల మధ్య, పాండిచ్చేరికి సమీపంలో శనివారం మధ్యాహ్నం తీరం దాటడంతో జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఫెంగాల్ తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఆది, సోమవారాల్లో వర్షాలు కురవనున్నాయి. ఫెంగాల్ తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు ప్రారంభం కావడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా అధికార యంత్రాంగంను అప్రమత్తం చేశారు. క్షేత్ర స్థాయిలో తహసిల్దార్లు, ఎంపిడిఓలు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు సమన్వయంతో కలిసి ఫెంగాల్ తుఫానును ఎదుర్కొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఎక్కడ ఎలాంటి నష్టం జరిగే అవకాశం వున్నా ఉన్నత అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలు ఫెంగాల్ తుఫాను ప్రభావంతో జిల్లాలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. చెరువల కట్టలు, కాలువ కట్టల పరిరక్షణపై దృష్టి పెట్టాలని, వాగులు, వంకలు, కాలువల వద్ద అప్రమత్తంగా వుండాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఫెంగాల్ తుఫాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి కలెక్టరేట్‌లో 94919 77356, 08572 242777 నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా అధికారుల నుండి నియోజకవర్గ, మండల, సచివాలయ, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది వారి ప్రధాన కార్య స్థానాల్లో అందుబాటులో వుండాలని ఆదేశించారు.

**రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు :**

ఫెంగాల్ తుఫాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోని అర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. చిత్తూరు అర్డీఓ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెం.94910 77011, కుప్పం అర్డీఓ కార్యాలయ కంట్రోల్ రూమ్‌నెం.99660 722234, పలమనేరు అర్డీఓ కార్యాలయ కంట్రోల్ రూమ్ నెం.94910 74510, నగరి అర్డీఓ కార్యాలయ కంట్రోల్ రూమ్ నెం.96521 38325లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

# స్వర్ణమ్మ నదీ హారతులకు... దీపాల కాంతితో కళ కళ

# కార్తీక దీపాలతో... కదలి వచ్చిన భక్త జనం


గంగాదేవికి పూజలు



శ్రీకాళహస్తినవంబర్ 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో శతాబ్దాల క్రితం నాటి 'స్వర్ణమ్మ నదీ హారతులకు' శాసన సభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సూచనలతో ఇఓ టి.బాపిరెడ్డి వారి సిబ్బంది కృషితో విజయవంతం అయింది. శ్రీకాళహస్తి చరిత్రలో 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవ రాయలు విజయయాత్రలో భాగంగా ఇక్కడకు వచ్చి స్వర్ణముఖి తల్లికి హారతు లిచ్చినట్లు స్థానిక పూర్వీకులు చెబుతారు. నదిలో నీటిని నిల్వ చేయించి, జనానికి తెలియని 'స్వర్ణమ్మ హారతుల్ని' పునఃప్రారంభించి, కొత్త దనాన్ని గత కొన్ని సంత్సరాలుగా చేయడం ఆనవాయితీగా మారింది.

**భక్తి శ్రద్ధలతో హారతులు:**

శ్రీకాళహస్తీశ్వరాలయం చేపట్టే కార్యక్రమాలకు భక్తులు, జనం నుంచి విశేష స్పందన వచ్చింది. దేవస్థానం నేతి దీపాల్ని భక్తులకు అందించారు. అలాగే ఉచిత ప్రసాదాల్ని అందించారు. శనివారం ఉదయం నుంచి ఫెంగల్ తుఫాను గడ గడ లాడించింది. అయినా అధికారులు పట్టువదలని విక్రమార్కుల్లా పనులు చేసారు. రాత్రి ఏడు గంటల వరకు హారతులు ప్రారంభించారు.

**అంచనాలకు మించి భక్తులు:**

'శతాబ్దాల క్రితం నాటి 'హారతుల' గురించి విస్తృతస్థాయిలో ప్రచారం జరిగింది, ఇక్కడి దేవస్థానం స్వర్ణముఖి నదికి వదర వచ్చినపుడు వా యనాలు వదలటం ఆనవా యితి. హారతుల్ని తిలకించ టానికి వర్షాన్ని సైతం లెక్క చేయక సన్నిధివీధి, జల వినాయకుని వెంతెన, పడమర వైపు కట్ట, స్నానఘట్టాల మీద కిక్కిరిసి కనబడ్డారు.


స్వర్ణముఖినదికి హారతులు ఇస్తున్న దృశ్యం

**విశేష హారతులు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసంలో నిర్వహించే గంగా హారతులకు సంబంధించి దేవస్థానం ముందుగా అమ్మవారిని విశేషంగా అలంకరించి స్వర్ణముఖినది వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేర్చారు. మొదట శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఇఓ టి.బాపిరెడ్డిలు జ్యోతి వెలగించి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వేదపండితులచే వేదపఠనం జరిపారు. ధూపం, దీపం, రథ హారతి, చక్ర హారతి,ఏక హారతి, ద్వితీయ హారతి తృతీయ హారతి, చతుర్థ హారతి, పంచ హారతి, పంచబ్రహ్మ హారతి, కుంభ హారతి, ఛత్రం, వింజామరం, ధామరము, ధ్వజము దర్పణం, వేలాయుధం, కర్పూర హారతి, మంత్ర పుష్పం, కర్పూర కల శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈహారతుల్ని దర్శించుకొనుటకు భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఓ టి బాపిరెడ్డి,డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఇఇ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి వారి సిబ్బంది హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో హారతు లను రాజేష్ గురుకుల్, సూరి గురుకుల్, నిరంజన్ గురుకుల్, రామనాధన్ గురుకుల్, కమల్ గురుకుల్ అందించారు. వేదపండితులు మారుతీశర్మ, నారాయణన్ గురుకుల్, ప్రభాకర్ శర్మ, అభిషేష్, విశ్వనాథ్‌భట్టు, వశిష్ట, శ్రీవాత్సవ, అంజనేయ అవధాని, హేమంతకుమార్ శర్మ, హేమంత కృష్ణమా చార్యలు, పౌరోహితులు అర్ధగిరి స్వామి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఏ మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డితో పాటు పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు, ధనంజయులు నాయుడు, సుప్రజ, మల్లీశ్వరి, ఇఓ బాపిరెడ్డి దంపతులు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పక్కాగా స్క్రీనింగ్ పరీక్షలు : కమీషనర్

**చిత్తూరు, నవంబర్ 30 ప్రభాతవార్త:** నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆర్బీఎస్కే స్క్రీనింగ్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ పేర్కొన్నారు. శరవణపునం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం జరుగుతున్న ఆర్బీఎస్కే స్క్రీనింగ్ పరీక్షలను మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరును టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు: ఎంపీ

**చిత్తూరు, నవంబర్ 30 ప్రభాతవార్త:** చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి పూర్తి సహకారం అందించాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కోరారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో శనివారం ఎంపీ దగ్గుమళ్ళ కేంద్ర పర్యాటక శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి చంద్రగిరి విజయనగర సామ్రాజ్య రెండవ రాజధానికి అలాంటి కోటను ఆధునీకరించి భవిష్యత్ తరాలకు చూపించేలా వుండాలని కోరారు. చంద్రగిరి కోటను సంరక్షించడంతో పాటు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి సహకారం అందిం చాలని కోరారు.



## ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

**బంగారుపాళ్యం, నవంబర్ 30 ప్రభాతవార్త:** బంగారుపాళ్యం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం శనివారం ఏర్పాటు అయ్యింది. ప్రింట్ మీడియాకు చెందిన విలేకరులు నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షులుగా ప్రతాప్‌సేన్, అధ్యక్షులుగా అరవిందబాబు, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, కోశాధికారిగా శంకరన్, ఉపాధ్యక్షులుగా ఉమాపతి, రామచంద్రులు, సంయుక్త కార్యదర్శులుగా బాలయ్య, చాన్‌భాష, జ్యోతినాథ్‌లు ఎన్నికయ్యారు.

## ఎక్సైజ్ దాడులు...సారా ఊట ధ్వంసం

**శ్రీరంగరాజపురం, నవంబర్ 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్నత య్యూరు గ్రామంలో శనివారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు 600 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ అశోక్, కార్వేటినగరం ఎక్సైజ్ ఎస్ఐ మోసెస్, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవనపంటల రైతులకు పదికోట్ల నిధులు కేటాయింపు




**శాంతిపురం, నవంబర్ 30 ప్రభాతవార్త :** కుప్పం నియోజకవర్గంలో ఉద్యానవన పంటలసాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పది కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల ఆర్యాలయంలో రైతులకు మామిడి, టమోటా సాగు, ప్రభుత్వ సాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు ఎకరాల్లోపు పంటలు సాగు చేసే రైతులకు ఎకరాకు 97వేలు అందించడం జరుగుతుందన్నారు. అరటిసాగులో శాంతిపురం మండలం ఆదర్శంగా నిలిచిందన్నారు. శాస్త్రవేత్త రామయ్య మాట్లాడుతూ పంటనష్టపరిచే పురుగులు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, మణి, ఎల్.జయరాంరెడ్డి, చంద్ర, ఉయ్యాల జయరాంరెడ్డి, తెలుగు మహిళఅధ్యక్షురాలు అనసూయ, హెచ్ఓ వింధ్య, మనోజ్‌కుమార్, వినయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

## శాంతిపురంలో నూతనంగా లయన్స్‌క్లబ్ ఏర్పాటు

**శాంతిపురం, నవంబర్ 30 ప్రభాతవార్త :** శాంతిపురంలో నూతనంగా లయన్స్ క ్లబ్‌ను ఏర్పాటుచేసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా నందిగం ఉదయ్‌కుమార్, కార్యదర్శిగా బాబు, కోశాధికారిగా రవి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా మురుగేష్, ఉమాపతి, సభ్యులుగా భాను ప్రకాష్, ఉయ్యాల జయరాంరెడ్డి, జనార్ధనరెడ్డి, హరిప్రసాద్, శివశంకర్, ఎల్.జయరాంరెడ్డి, కోఆర్డినేటర్‌గా చంద్రశేఖర్‌తో పాటు పలువురు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర మ్రత్ హాజరయ్యారు. కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ సలహాదారు డా॥ మహేష్, కౌన్సిలర్ సోమశేఖర్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## స్మార్ట్ లాక్‌లు ఏర్పాటుచేసుకోవాలి

రామకుప్పం, నవంబర్ 30 ప్రభాతవార్త :



దొంగతనాలకు చెక్ పెట్టేందుకు సాధ్యమైనంత వరకు ప్రతి ఒక్కరూ స్మార్ట్ లాక్‌లు ఏర్పాటుచేసుకోవాలని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై వెంకట మోహన్ కోరారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని పలు ఆలయాలు, ప్రార్ధనామందిరాలకు దాతల సాయంతో స్మార్ట్ లాక్‌లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్లకు, దుకాణాలకు వీటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## వర్షాలకు కూలిన ఇంటి గోడలు

**పాలసముద్రం, నవంబర్ 30 ప్రభాతవార్త:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన గంగయ్య, సరోజమ్మ, వెంకటమ్మల ఇంటి గోడలు శనివారం మధ్యాహ్నం కూలిపోయాయి. ఈ సమయంలో కుటుంబ సభ్యులు ఎవ్వరు వారి ఇళ్ళల్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంటి గోడలు కూలిన సమాచారం తెలుసుకున్న విఆర్ఓ వెంకటాచలం, సర్పంచ్ నరసింహరాజులు సంఘటనా స్థలం చేరుకుని ఇళ్ళను పరిశీలించారు. వర్షాలకు గోడలు పూర్తిగా నానిపోవడంతో కూలిపోయాయని వారు నిర్ధారించారు.

## వర్షంలోను పెన్షన్లు పంపిణీ చేసిన సచివాలయ సిబ్బంది

**పాలసముద్రం, నవంబర్ 30 ప్రభాతవార్త:** ఫెంగాల్ తుఫాను ప్రభావంతో పాలసముద్రం మండల పరిధిలో శనివారం భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్ళి అర్హులైన లబ్దిదారులకు సామాజిక పెన్షన్లు అందజేశారు. ప్రభుత్వం డిసెంబర్ నెలకు సంబంధించి ఒక రోజు ముందుగానే పెన్షన్లు అందించాలని ఆదేశించడంతో సచివాలయ సిబ్బంది వర్షం కురుస్తున్నప్పటికీ మండలం మొత్తం తిరిగి లబ్దిదారులకు పెన్షన్లు అందజేశారు. మణిపురం గ్రామంలో ఎంపిడిఓ మహేష్‌రెడ్డి పెన్షన్ల పంపిణీ కార్యక్రమంను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం పెన్షన్లు తీసుకోని లబ్దిదారులకు సోమవారం పెన్షన్లు పంపిణీ చేస్తామని ఎంపిడిఓ పేర్కొన్నారు.

## నేడు సోమల లో ఉచిత వైద్య శిబిరం

సోమల, నవంబర్ 30 ప్రభాతవార్త :

సోమల జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టిడిపి సీనియర్ నాయకుడు స్టేట్ ఐడీసీ మాజీ డైరెక్టర్ సాంబయ్య తెలిపారు. బెంగళూరుకు చెందిన వైదేహి ఆసుపత్రి వారి సౌజన్యంతో శిబిరాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు మరో టిడిపి సీనియర్ నాయకుడు కామిశెట్టి నగేష్ తెలిపారు. వైద్య శిబిరంలో రోగులకు గుండె, క్యాన్సర్, డయాబెటిక్, ఎముకలు, కీళ్లు, గ్యాస్టిక్ ట్రబుల్ లాంటి రోగాలకు ఉచిత వైద్యం అందిస్తామని అవసరమైన వారికి బెంగళూరు తీసుకువెళ్లి ఆపరేషన్ నిర్వహిస్తామని కార్యనిర్వాహకులు తెలిపారు.

## రాష్ట్ర బిసిఫ్రెంట్ ఉపాధ్యక్షులుగా గడదేశి నియామకం



**పెద్దపంజాణి, నవంబర్30 ప్రభాతవార్త :** రాష్ట్ర బిసిఫ్రెంట్ ఉపాధ్యక్షులుగా పెద్దపంజాణి మండలం బొమ్మలకుంట గ్రామానికి చెందిన గడదేశి వెంకట రమణను నియమిస్తూ బిసిఫ్రెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు అద్దంకి రమణమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. శనివారం ఉండవల్లిలోని బిసి ఫ్రెంట్ కార్యాలయంలో రాష్ట్రకార్యవర్గం జరగింది.ఈ సందర్భంగా రాష్ట్ర బిసిఫ్రెంట్ ఉపాధ్యక్షులుగా గడదేశి వెంకటరమణను కార్యవర్గసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షులు అద్దంకి రమణమూర్తి నియామక పత్రాన్ని అందించారు. గడదేశి వెంకటరమణ నియామకంపట్ల మండలంలోని బిసినేతలు పలువురు హర్షంవ్యక్తం చేశారు.

## తుఫాను దాటికి చెట్లు నేలమటం...రోడ్లు ధ్వంసం



**సత్యవేడు, నవంబరు 30 ప్రభాతవార్త:** సత్యవేడు, పరిసర ప్రాంతాల్లో తుఫాను ప్రభావం వల్ల పెను గాలులతో కూడిన వర్షం శుక్రవారం రాత్రి నుంచి పడుతోంది. ఈ నేపథ్యంలో గాలుల తాకిడికి చెట్లు నేలకొరుగుతున్నాయి. ఇందులో భాగంగా తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలో సత్యవేడు టు ఊత్తుకోట ప్రధాన మార్గంలో వెంకటరాజుల కండ్రిగ చెక్‌పోస్టు వద్ద శనివారం ఉదయం రోడ్డుకు అడ్డంగా చెట్టు నేలకొరిగింది. దీంతో వాహన రాకపోకలు ఇరువైపులా స్తంభించిపోయాయి. సమాచారం అందడంతో స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీనాయుడు సూచన మేరకు ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో పోలీసు బృందం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామ సర్పంచ్ సుజాత, గ్రామస్తులు సహకారంతో పోలీసులు రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును, కొమ్మలను జేసీబీ ద్వారా తొలగించారు. చెట్టు నేలకొరిగిన గంట వ్యవధిలోని పోలీసులు వెంటనే స్పందించి సంఘటనా స్థలం చేరుకుని చెట్టును తొలగించి వాహన రాకపోకలను క్లియర్ చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి సత్యవేడులో ఆర్‌అండ్‌బీ ఏఈ పోస్టు భర్తీ కాకపోవడంతో పాటు ఇన్‌చార్జి ఇవ్వడంతో ఆర్‌అండ్‌బీ శాఖ అధ్వానంగా మారిందన్న ఆరోపణలు లేకపోలేదు.

## ఆఫీసు సబార్డినేట్లకు రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి

**చిత్తూరు, నవంబర్ 30 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ పరిధిలో ఇప్పటి వరకు ఆఫీసు సబార్డినేట్లుగా విధు లు నిర్వహిస్తున్న 20 మందికి జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు పదోన్నతులకు అర్హులైన ఆఫీసు సబార్డినేట్ల జాబితాను సిద్ధం చేసిన జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడుఆమరకువారికి రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## పోలీసు అధికారులకు ఆత్మీయ వీడ్కోల్లో జిల్లా ఎస్పీ



**తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 30 ప్రభాతవార్త :** పదవి విరమణ పొందిన పోలీసు అధికారులు శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపాలని జిల్లా ఎస్పి సుబ్బరాయుడు తెలిపారు. శనివారం నవంబర్ నెలలో పదవీ విరమణ పొందిన ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బందిని స్థానిక పోలీస్ అతి థి గృహం కాన్ఫరెన్స్ హాల్ నందు వారి కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేసి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమా నికి అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, ఎల్ ఓ, పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు కుటుంబ సభ్యులు,పోలీస్‌అధికారుల సంఘం అధ్యక్షులుసోమశేఖర్‌రెడ్డి,సెక్రటరీ శంకర్‌రెడ్డి, సభ్యులు హాజరయ్యారు.

## విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 30 ప్రభాతవార్త :** విద్యార్థులు వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తిరుపతి మహిళా పోలీసు డీఎస్పీ ఎం శ్రీలత హితవు పలికారు. శనివారం న్యూ బాలాజీ కాలనీలోని ఎస్ డి.హెచ్.ఆర్.జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వ్యసనం, మహిళలపై అఘాయిత్యాలు, సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు దారి తప్పిన యువతకు దండన తప్పి ప్రవర్తిస్తే కేసులు, శిక్షలు తప్పవన్నారు. శనివారం తిరుపతిలో కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వ్యసనం, మహిళలపై అఘాయిత్యాలు, సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్ బి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక విలువలు పాటించిన వారిని విజయాలు వర్తిస్తాయని చెప్పారు. సీఐ టి అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు ఆదర్శవంతంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దీపిక, ఎస్ఐ గిరిజ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇవేమి రోడ్లు బాబోయ్...పేట రహదారి అధ్వాన్నం

**శ్రీకాళహస్తిరూరల్,నవంబర్ 30 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లోని రోడ్ల పరిస్థితి చిన్న పాటి వర్షాలకే అధ్వాన్నంగా మారింది. ముఖ్యంగా విమానాశ్రయానికి సమీపంలోని ఎన్నో పెద్ద పరిశ్రమలు ఉన్న పాపానాయుడుపేట-ముసలిపేడు దారిలో పయనించాలంటే దడపుడుతుందని వాహనదారులు వాపోతున్నారు.కొద్ది పాటి వర్షాలకే గుంతల మయంగా మారింది. అసలే సింగిల్ రోడ్డు దీనికి తోడు గతుకుల మయమైంది. అయితే ఈ సమస్యకు సంబంధించి ఒరెండు గ్రామాలకు చెందిన వారు అధికారులకు వివరించినా పట్టించుకోవటం లేదు.శాసనసభ్యులు ఈ రోడ్డు దుస్థితిపై స్పందించి ప్రత్యేక నిధులను మంజూరు చేయించి బాగు చేయించాలని కోరుతున్నారు.

## సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా చేస్తాం : ఎమ్మెల్యే



**పుత్తూరు, నవంబరు 30 ప్రభాతవార్త :** నగరి నియోజకవర్గంలో ప్రజలకు ఒక వైపు సంక్షేమ పథకాలు అందిస్తూ మరో వైపు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నా మని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో తుడా నిధులు రూ.4.80 లక్షలతో నిర్మించిన మంచినీటి ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలనే ఉద్దేశ్యంతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద , ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ మంజునాథ్ గౌడ, టిడిపి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్. ధనపాల్, డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రమాదంలో గాయపడ్డా...వృత్తి ధర్మం కోసం!

చౌడేపల్లి, నవంబర్ 30 ప్రభాతవార్త :



తెల్లవారు జామునే వర్షం కురుస్తున్న సమయమది ఫించన్లు ఇచ్చేందుకని తన టూవీలర్‌పై వెళుతూ మలుపు తిరుగుతుండగా వెనుకనుంచి వచ్చిన మరో ద్విచక్రదారుడు ఢీకొన్నాడు...వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స చేసారు...విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు తెలపగా ఫించను ఇవ్వనిదే ఇంటికి వెళ్ళనని పండుటాకుల వద్దకు వెళ్ళింది... వృత్తిధర్మాన్ని పాటించిన అధికారిని గురించి... స్థానిక సచివాలయం-2 నందు లత ఎఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తోంది. స్థానిక నేతాజీనగర్‌లో ఎన్టీఆర్ భరోసా ఫించన్లను అందించే బాధ్యతను తీసుకొంది. శనివారం ఉదయాన్నే పట్టణంలోని నేతాజీ నగర్‌కు టూవీలర్‌పై చేరకొన్న లత గంగమ్మ ఆలయం మలుపు తిరుగుతుంగా వెనుకనుంచి వచ్చిన మరో టూవీలర్ ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో లతకు గాయాలయ్యాయి. గాయపడ్డ ఆమెను స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. కాళ్ళు, చేతులకు బలమైన గాయాలు కావడంతో విశ్రాంతి అవసరమని వైద్యులు ధృవీకరించారు. అయితే తాను ఫించన్లను పూర్తిగా పంపిణీ చేసి ఇంటికి వెళతానని చెప్పి గాయాలతోనే ఎన్టీఆర్ భరోసా ఫించన్లందించింది. ఫించన్లపైనే ఆధారపడిన పండుటాకులకు ఒక్కరోజు ఆగినా ఇబ్బందులు పడుతారనుకొని వృత్తి ధర్మాన్ని పాటించిన ఎఎన్ఎం లతను అందరూ అభినందించారు.

## రాజనాలబండపై తీరిన భక్తుల దాహార్తి

-వార్త ప్రభావం



**చౌడేపల్లి, నవంబర్ 30 ప్రభాతవార్త :** సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండపై భక్తులకు శుద్ధజలం లభించింది. దీంతో భక్తుల దాహార్తి తీరింది. " రాజనాలబండ భక్తులకు అందని ద్రాక్షపండులా శుద్ధజలం "అన్న శీర్షికన వార్తలో కథనం ప్రచురితమైన విషయం విధితమే. స్పందించిన టిటిడి అధికారులు ఆర్ఓ యంత్రాలను అమర్చి భక్తులకు శుద్ధజలాన్ని అందించారు. దీంతో భక్తులతోపాటు చుట్టుపక్కల వారు టిటిడి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షణ్ముగం



**చిత్తూరురూరల్, నవంబరు 30 ప్రభాతవార్త:** జాతీయ బిసి సంక్షేమ సంఘ కార్యాలయం నందు జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చిత్తూరు కోఆపరేటివ్ మాజీ ఛైర్మెన్ షణ్ముగంకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రం అందజేసారు. ఈ సందర్భంగా షణ్ముగం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలుపుతూ నాపై నమ్మకం వుంచి అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా రాజకీయ పార్టీలకతీతంగా రాష్ట్రంలోని బిసి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల కోసం నిర్వహిస్తానని తెలిపారు.

## ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం



**యర్రావారిపాలెం, నవంబర్ 30 ప్రభాతవార్త :** యర్రావారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కళ్యాణ్ కుమార్ రెడ్డి, లినాకుమారి ఆధ్వర్యంలో శనివారం ఎయిడ్స్‌పై ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ కాలేజ్ నందు ఎయిడ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అంటు వ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని అన్నారు. గ్రామాల్లోని ప్రజలు ప్రతి ఒక్కరూ హెచ్ఐవి టెస్ట్ చేసుకోవాలని కోరారు. వారికి కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తులసి విజయలక్ష్మి సరస్వతి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీ చిచ్చిలిని పరామర్శించిన ఎంపీ



**రొంపిచెర్ల, నవంబర్ 30 ప్రభాతవార్త:** రొంపిచెర్ల ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డిని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పరామర్శించారు. శనివారం చిచ్చిలి వారిపల్లెలో ఎంపీపీ తల్లి చెంగమ్మ అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు ఈ సందర్భంగా ఎంపి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీపీ కుటుంబానికి ఎలాంటి కష్టం వచ్చినా పెద్దిరెడ్డి కుటుంబం ఎప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. ఎంపీపీ పురుషోత్తం రెడ్డి భార్య అరుణమ్మ కుమారుడు ప్రశాంత్‌రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు నూల్ రెడ్డప్ప, విజయశేఖర్, నాయకులు సలీం భాష, డాక్టర్ శ్రీనాథ్ ,కోట వెంకటరమణ, ప్రసాద్ నాయుడు, మహబూబాషా నాగిరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, శివారెడ్డి, కమలాకర్ రెడ్డి, హరికృష్ణ రెడ్డి, బషీర్, మస్తాన్, రాజా సాహెబ్ పీలేరు సర్పంచ్ హబీబ్ భాషా, తదితరులు పాల్గొన్నారు

## దేవస్థానం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**కాణిపాకం, నవంబర్ 30 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానం 2025 సంవత్సరం నూతన క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ శనివారం ఆవిష్కరించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ప్రతి సంవత్సరం క్యాలెండర్‌లను ముద్రించి విక్రయిస్తుంటుంది. ఈమేరకు దేవస్థానంలో ప్రతిరోజూ జరిగే పూజలు, వివిధ రకాల సేవల వివరాలు, ఉత్సవాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన క్యాలెండర్‌ను టెండర్‌దారు ముద్రించారు. ఐరాల మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావు, స్థానిక టీడీపీ నాయకులు హేమాద్రినాయుడు, నరసింహులునాయుడు, బాబునాయుడు శరవణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్



## తిరుమలను కుదిపేస్తున్న ఫెంగల్

-ఉదయం నుండి జోరువాన -చలికి వణుకుతున్న భక్తులు

**తిరుమల,నవంబర్ 30 ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండురోజులుగా తిరుమలలో జోరువర్షం కురుస్తోంది. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కొం డపై తిరుపతిలో భారీ వర్షం కురుస్తోంది. వాతా వరణంలో మార్పుతో చలిగాలులు వీస్తున్నాయి. ఒక్కసారిగా జోరువాన కురవడంతో భక్తులు ఎక్కడికక్కడే ఆగిపోయారు. కురిసిన భారీ వర్షానికి ఆల యం ప్రాంతం, పరిసరాలు జలమయంగా మారాయి. తిరుమల కొండలను పొగమంచు కప్పేసింది. సాయంత్రం నుండి పూర్తిగా మంచుతో తిరుమలను కప్పేయడంతో వాహనాలు,భక్తులు దగ్గరగా వస్తేగానీ కనిపించే పరిస్థితి లేదు. చలివిపరీతంగా వుంది. చిన్నపిల్లలు, వృద్ధులు గదుల నుండి బయటకు రావాలంటే పడుతున్నారు.

## కపిలతీర్థంలో కాలభైరవ హోమం



తిరుపతి(రవాణ),నవంబర్ 30ప్రభాతవార్త: తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం కాలభైరవహోమం నిర్వ హించారు. కార్తీకమాస విశేష పూజలు,హోమాల్లో భాగంగా ఉదయం నుండిప్రత్యేకపూజలు జరిపించారు.ఆలయ డిప్యూటీఈఓ దేవేంద్రబాబు, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

## ఆయన సేవలు ఆర్టీసిలో అమోఘం

తిరుపతి(రవాణ),నవంబర్ 30 ప్రభాతవార్త: తిరుపతిజిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో డిసిటిఎం ఎం.భాస్కర్ సేవలు అమోఘమని జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.జగదీష్ అభినందించారు.శనివారం ఆయన పదవీవిరమణ చేయడంతో అటు సంస్థకు ఇటు ఉద్యోగులు, ప్రయాణీకులకు అందించిన సేవలను కొనియాడారు. దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిటిసి అధికారులు జి.నరసింహులు, పి.విశ్వనాథ్ , టి.బాలాజీ, తిరుమల డిఎం, ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్థానికులకు గోవిందుని దర్శనభాగ్యం

**తిరుమల,నవంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల, తిరుపతి నగరం, రూరల్,చంద్రగిరి, రేణిగుంట మండలాల్లోని స్థానికులకు ఏడుకొండల వేంకటేశ్వర స్వామి దర్శనభాగ్యం పునఃప్రారంభమ వుతోంది. ఇందుకు డిసెంబర్ 3వతేదీ మంగళవారం ఉదయం స్థానికులకు గోవిందుని దర్శనం కల్పిస్తున్నారు. ఈ దర్శనానికి స్థానికుల కోటా క్రింద ఆధార్‌కార్డు ఆధారంగా 2వ తేదీ సోమవారం ఉదయం 5గంటలకు ఉచిత దర్శన టోకెన్లను టిటిడి జారీ చేస్తోంది. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో,తిరుమలవాసులకు బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో కౌంటర్లలో టోకెన్లు జారీచేస్తారు. స్థానికులకు ప్రతి మంగళవారం 5వేలమందికి దర్శనం కల్పిస్తూ గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం హయాం లోని టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్ కనుమూరి బాపిరాజు ఆమోదించారు.3వతేదీ మంగళవారం రోజు తొలిసారిగా కల్పిస్తున్న దర్శనానికి సోమవారం 2వతేదీ (రేపు)ఉదయం టోకెన్లు జారీచేస్తారు.

## హెల్ప్ లైన్ నంబర్‌ను సద్వినియోగం చేసుకోండి : కమిషనర్



**తిరుపతి కార్పొరేషన్ ప్రభాతవార్త :** పెంగల్ తుఫాను వలన కురిసే వర్షాలకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా హెల్ప్ లైన్ నంబర్ 90008 22909, 0877 2256766లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ప్రజలను కోరారు. తుఫాను బాధితుల సహాయం కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్‌ను శనివారం సాయంత్రం కమిషనర్ పరిశీలించారు. తుఫాను నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు.వర్షాలకు ఎవరైనా ఇబ్బంది పడితే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మేనేజర్ హాసీం, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ.రాజు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.

## తుఫాను వర్షంలో ఫించను నగదు అందించిన ఎంఎల్ఏ



**శ్రీకాళహస్తి, నవంబర్ 30 ప్రభాతవార్త :** ఓవైపు ఫెంగాల్ తుఫాను..ఉదయం నుంచి భారీ వర్షం, ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి శనివారం ఉదయాన్నే పట్టణానికి సమీపంలోని రాజీవ్‌నగర్‌లో ఉన్న ఫించను లబ్ధిదారులకు ఫించను అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫెంగాల్ తుఫాను కారణంగా వర్షాలు ఉధృతంగా కురుస్తున్నా కూడా లబ్దిదారులకు ఫించన్లు పంపిణీచేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తొలిసారిగా రాష్ట్రంలో సామాజిక భద్రత ఫించన్ల ఫధకాన్ని ప్రవేశపెట్టి టిడిపి ప్రభుత్వమేనన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఒడిదుడుకులుగా ఉన్నా పేదల సంక్షేమం అమలు విషయంలో టిడిపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సిఎం చంద్రబాబు నాయుడు స్వయంగా లబ్దిదారుల ఇండ్లకు వెళ్లి ఫించన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు విజయకుమార్ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యానాయుడు, మాజీ కౌన్సిలర్ బషీర్, పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదు ఫోన్ల అందజేత

**శ్రీకాళహస్తి, నవంబర్ 30 ప్రభాతవార్త :** గతంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మరియు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియలో చురుగ్గాపాల్గొని ఆన్‌లైన్‌లో నమోదు ఎక్కువ చేసిన బాలాజీ, సునీల్, ఖాదర్‌లకు ఎంఎల్ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మొబైల్‌ఫోన్లు బహుమతిగా అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను బాధితులకు అండగా ఉండాలి : ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి, నవంబర్ 30 ప్రభాతవార్త : ఫెంగాన్ తుఫాను తీవ్రత అధికంగా ఉండడంతో భారీ వర్షాలు కురుస్తాయని ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు రక్షణగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. రెండు మూడు రోజు పాటు తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపినట్లు వివరించారు. ప్రతి మండలంలోటోల్‌ఫ్రీనంబర్‌నుఇచ్చామనివాటికిఫోన్‌చేసిసాయంపొందవచ్చున్నారు.

## మండలంలో 93శాతం ఫించన్ల పంపిణీ



**తొట్టంబేడు, నవంబర్ 30 ప్రభాతవార్త :** మండలంలో సామాజిక భద్రత ఫించన్లు 93శాతం పంపిణీచేసినట్లు ఎంపిడిఓ సురేంద్రనాద్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 6568మంది ఫించను లబ్దిదారులు ఉండగా శనివారం ఒక్కరోజే 6101మందికి ఫించన్లు పంపిణీచేశామని ఎంపిడిఓ తెలిపారు.మిగిలిన ఫించన్లు నేడు పంపిణీచేసి వందశాతం పూర్తిచేస్తామన్నారు.

## తిరుపతి జిల్లాలో 91.87శాతం ఫించన్లు పంపిణీ



**శ్రీకాళహస్తి, నవంబర్ 30 ప్రభాతవార్త :** తిరుపతి జిల్లాలలో 91.87శాతం ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తిచేశామని డిఆర్‌డిఏ పిడి టిఎన్.శోభన్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,64,636 మంది లబ్దిదారులు ఉండగా 2,43,491మందికి శనివారం సాయంత్రం 7వరకు ఫించన్లు పంపిణీచేసినట్లు తెలిపారు. ఫెంగాన్ తుఫాను ప్రభావంతో తీవ్రంగా కురుస్తున్న వర్షాలను సైతం లెక్కచేయక సిబ్బంది గ్రామాల్లోను, పట్టణాల్లోను ఫించన్లు పంపిణీచేశారన్నారు.మిగిలిన ఫించన్లు నేడు, సోమవారాల్లో పంపిణీచేసి వందశాతం పూర్తిచేస్తామన్నారు. ఓజిలి సచివాల యంలో సందర్శించిన సూళ్ళూరుపేట డియల్‌డిఓ జాలిరెడ్డి, ఎంపిడిఓ విజయలక్ష్మిలు పరిశీలించారు.

## కార్తీక వనమహోత్సవానికి గౌడ కులస్తులకు ఆహ్వానం

**శ్రీకాళహస్తి, నవంబర్ 30 ప్రభాతవార్త :** చంద్రగిరి సమీపంలోని తొండవాడ ముక్కోటి వద్ద నారాయణ గార్డెన్స్ లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని గౌడ కులస్తులు హజరు కావాలని పట్టణంలోని హౌసింగ్ బోర్డు టిడిపి ఇన్‌ఛార్జి భాస్కర్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఏపి ఆర్టీసి ఛైర్మన్ కొనకల్ల నారాయణ, మాజీ మంత్రి కెఈ ప్రభాకర్, శ్యాంసుందర్, గౌతు శిరీష, పలాస ఎంఎల్ఏ టిటిడి బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొంటారన్నారు.

## పెన్షనర్స్ మహిళా కార్యదర్శికి ఘన సన్మానం.




**రేణిగుంట, నవంబర్30 ప్రభాతవార్త :** అహ్మద్ నగర్ నందు జరిగిన ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ 59వ సమావేశం ఘనంగా ముగిసింది. సమావేశానికి అహ్మద్ నగర్ ఎమ్మెల్యే సంగ్రామ్ జగటాప్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సమావేశాలు జాతీయ నాయకులు డాక్టర్ శ్రీధర్ అధ్యక్షతన, అహ్మద్ నగర్ ఏఐఆర్ఎఫ్ కార్యదర్శి శ్వేతా మూలే ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా రేణిగుంట సిఆర్ఎస్ ఏఐఆర్ఎఫ్ కార్యదర్శి విజయ్ కుమార్, అధ్యక్షులు సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు గజపతి నాయుడు, కృష్ణ దాస్ తదితరులు శ్వేతా మూలే పతక్ ను శాలువులు కప్పి పూల బొకేలిచ్చి ఘనంగా సత్కరించారు ఆర్డిటి 3. కార్యదర్శి సత్కరిస్తున్న నేతలు.

## వెట్టి చాకిరి నుండి విముక్తి

**రేణిగుంట, నవంబర్ 30ప్రభాతవా రరేణిగుంట :** మండలం అంకమ నాయుడు మిట్టలోని ఓ రైస్ మిల్లు నందు 15 సంవత్సరాలుగా వెట్టి చాకిరి చేస్తున్న 10మంది కార్మికులకు రెవిన్యూ అధికారులు శనివారం విముక్తి కలిగించారు. రెవెన్యూ అధికారులకు అందిన సమాచారం మేరకు శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట తహసిల్దార్ సురేష్ బాబు తమ సిబ్బందితో అంకమ నాయుడు మిట్ట లోని రామయ్య రైస్ మిల్ పై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు.

## తక్కువ ధరలకే ఏపీ ఫైబర్ నెట్వర్క్ సేవలు



**రేణిగుంట, నవంబర్ 30 ప్రభాతవార్త :** పేద, మధ్యతరగతి ప్రజలకు అతి తక్కువ ధరలకు ఏపి ఫైబర్ నెట్వర్క్ సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్ర ప్రదేశ్ ఫైబర్ నెట్వర్క్ చైర్మన్ జీవి రెడ్డి అన్నారు. రేణిగుంట విమానాశ్రయం వద్ద ఉన్న ఏపీ ఫైబర్ నెట్వర్క్ కార్యాలయం నందు శనివారం ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్వర్క్ చైర్మన్ జీవి రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు అతి తక్కువ ధరకే ఫైబర్ నెట్వర్క్, కేబుల్ కనెక్షన్లు, ల్యాండ్ ఫోన్ సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని తెలిపారు. ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. జియో, ఎయిర్టెల్ నెట్వర్కుల కంటే కూడా ఫైబర్ నెట్వర్క్ ద్వారా నాణ్యమైన సేవలు వినియోగదారులకు అందించేల కృషి చేస్తున్నామన్నారు. సంస్థలకు ఫైబర్ నెట్ సదుపాయాలను కల్పించడానికి ముఖ్యమంత్రితో సంప్రదించి తగు చర్యలు చేపడతామని తెలిపారు.

## విస్తారంగా వర్షాలు...ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**తిరుపతిరూరల్,నవంబర్30 ప్రభాతవార్త:** జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బంగాలఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పెంగల్ తుఫాన్గా మారిన నేపథ్యంలో తిరుపతిజిల్లాలో ఎడతెరిలేకుండా వర్షాలతో పాటు వీదురు గాలులు వీచాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అవసరం ఉంటే తప్ప ఎవర్వరు బయటకు రావద్దని అధికారులు సూచించారు. శనివారం మధ్యాహ్నం నుండి అన్ని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చేసారు.

## కార్మికులు ఉద్యోగులు విధులకు వెళ్ళద్దు : ఎస్ఐ




**వరదయ్యపాలెం, నవంబర్ 30 ప్రభాతవార్త :** పొంచి ఉన్న పెంగల్ తుపాన్ ముప్పు రహదారులపై కాలువల ప్రవాహ ఉధ్రుతికి స్తంభించిన రాకపోకలు స్తంభించిందని కార్మికులు, ఉద్యోగులు విధులకు వెళ్ళవద్దని, ప్రజలందరూ ఇళ్లలోనే ఉండండి అని ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు తీగలకు దూరంగా ఉండాలని, పూరి పాక గుడిసెలు కూలే స్థితి ఉంటే సురక్షిత ప్రాంతాలకి వెళ్ళాలని అన్నారు. పెంగల్ తుపాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు ప్రమాదకర ఘటనలపై తమకు ఫోన్ నెంబర్ 9440900725 ద్వారా సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వర్షం కారణంతో స్తంభించిన రాకపోకలు



**వరదయ్యపాలెం, నవంబర్ 30 ప్రభాతవార్త :** వర్షంతో వరదయ్యపాలెంలో రాకపోకలు స్తంభించినందున ఇలాంటి పరిస్థితులు ముందుగానే వస్తాయని గ్రహించి భారతీయ జనతా పార్టీ జిల్లా యువ మోర్చా కార్యదర్శి దిలీప్ రాయల్ గోవర్ధన పురంలో ఉన్న బ్రిడ్జి కూలే అందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని అటువైపు ఇటు వైపు వాహనాల పోవడానికి వర్షపు నీరు ప్రహరించడం వల్ల రాకపోకల స్తంభయిస్తాయన్నారు.ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక రోడ్డు దాట లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. భారీ వాహనాల వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా పోలీసులు పంపిస్తున్నారు.

## పెరిగిన పెన్షన్ తో పేదల కళ్లల్లో ఆనందం : ఎమ్మెల్సీ



**కుప్పం, నవంబర్ 30 ప్రభాతవార్త :** ఎన్నికల సందర్భంగా పెన్షన్ నగదు పెంచుతామని సిఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నిలుపుకున్నారని దీంతో పేదల కళ్లల్లో ఆన ందం కన్పిస్తోందని శాసనమండలివిప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధి 24వవార్డులో ఆయన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను పంపిణీ చేశారు. సిఎం చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పేర్కొన్నారు. వైకాపా పాలనలో ఓ చేత పథకాలు అంటూనే మరో చేత దోచుకున్నారని పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీలో త్వరలో 50కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్కుమార్ పాల్గొన్నారు.

## కుప్పం ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనుల పూర్తికి చర్యలు

– శాసనమండలి విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, నవంబర్ 30 ప్రభాతవార్త :** గత తెదేపా పాలనలో చేపట్టిన కుప్పం ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధి వడ్డిపల్లి సమీపం మీదుగా వెళ్లే రింగ్ రోడ్డును ఆయన పరిశీలించారు. కుప్పం పట్టణం విజలాపురం సర్కిల్ నుంచి డికెపల్లి పార్కు మీదుగా వడ్డిపల్లి, కుప్పం ఇండస్ట్రియల్ ఏరియా వరకు గతంలో రింగ్ రోడ్డు నిర్మాణానికి సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారన్నారు. త్వరలోనే రింగ్ రోడ్డు నిర్మాణ పనులు మరలా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సలహాదారు నరేష్చారి, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్దాము, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, సీనియర్ నేత జయరాంనాయుడు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు వుండాలి : కడ ప్రాజెక్ట్ డైరెక్టర్



**కుప్పం, నవంబర్ 30 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని సమర్థవంతంగా పాఠశాలల్లో పనిచేయాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ సూచించారు. గుడుపల్లె అగస్త్య ఫౌండేషన్లో పాఠశాల విద్యాశాఖ వారం రోజుల పాటు నిర్వహించిన రెసిడెన్షియల్ స్కూల్ లీడర్షిప్ కార్యక్రమం ముగింపు సమావేశంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ పాల్గొని ప్రస ంగించారు. అగస్త్య ఫౌండేషన్ అధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో మంచి కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులకు ఆవిష్కరణలు, టెక్నాలజీపై సైతం అవగాహన కల్పించడం మంచి పరిణామమన్నారు. కుప్పం ప్రాంతంలోని విద్యార్థులకు సైన్స్ రంగంపై అవగాహన కల్పించేందుకు గాను అగస్త్య ఫౌండేషన్కు త్వరలోనే బస్సులు ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.కార్యక్రమంలో అగస్త్య ఫౌండేషన్ ఛైర్పర్సన్ రామ్జీ రాఘవన్, ప్రాజెక్ట్ హెడ్ సురేష్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధికి చికిత్స లేదు...నివారణే మార్గం

**పుత్తూరు, నవంబరు 30 ప్రభాతవార్త :** ఎయిడ్స్ వ్యాధికి చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గమని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. డిసెంబరు ఒకటో తేదీన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం కాలేజీలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వ్యాధి తీవ్రత వల్ల ఎయిడ్స్ వ్యాధిని పట్టించుకోవడం లేదని, ఎయిడ్స్ వ్యాధి ప్రమాద తీవ్రత ఇంకా తగ్గలేదని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కోటేశ్వరయ్య, ఆర్ఆర్సి కన్వీనర్ డాక్టర్ షర్మిల, ఎన్సిసి అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాసులు, బాబూరావు, దేవకి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ భారత కరాటే చాంపియన్ షిప్

–బ్లూమింగ్ బడ్స్ విద్యార్థులు విజయకేతనం



చంద్రగిరి, నవంబర్ 30 ప్రభాతవార్త: దక్షిణ భారత కరాటే చాంపియన్ షిప్ మొదటి దశ పోటీలలో చంద్రగిరి బ్లూమింగ్ బడ్స్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్లో 2024 దక్షిణ భారత కరాటే చాంపియన్ షిప్ మొదటి దశ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 2 వేల మంది పాల్గొనగా బ్లూమింగ్ బడ్స్ విద్యార్థులు విజయం సాధించారు. మొదటి తరగతి విద్యార్థి రెడ్డిపల్లి కేయాన్ అండర్ 6 విభాగంలో 20 కేజీల కేటగిరి లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. అదేవిధంగా 6వ తరగతి విద్యార్థి రెడ్డి వరీష అండర్ 14 విభాగంలో 35 కేజీల కేటగిరిలో ద్వితీయ స్థాన ంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ బి.హితేంద్రనాథ్రెడ్డి మాట్లాడుతూ తైకా ్వండో, కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వలన ధృఢమైన సంకల్పంతో పాటు ఏకాగ్రత కలుగుతుందన్నారు. సమాజంలో ఎదురయ్యే అనేక సవాళ్ళను ఎదుర్కోవడానికి దోహద పడగలదన్నారు. విజేతలను అభినందనలతో ఆశీర్వదించారు.కరాటే మాస్టర్ ఆర్.బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## 92 శాతం మందికి పింఛన్లు పంపిణీ

**వడమాలపేట, నవంబర్ 30 ప్రభాతవార్త:** వడమాలపేట మండలంలో ఒక రోజు ముందుగానే 92 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా అధికారులు, సచివాలయ సిబ్బంది శనివారం ఉదయం నుంచి గ్రామాలకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

## వడమాలపేటలో 94 మి.మీ వర్షం

**వడమాలపేట, నవంబర్ 30 ప్రభాతవార్త:** వడమాలపేట మండలంలో శనివారం 94 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. శనివారం వేకువ జామున నుంచి ఈదురు గాలులతోకూడిన వర్షం ఎడతెరపి లేకుండా పడింది. దీంతో ప్రజాజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ఈదురుగాలులు కారణంగా ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వర్షాలకు మండలంలోని చెరువులు దాదాపుగా నిండిపోయాయి.

## వర్షంలో సైతం పింఛన్ పంపిణీ



**పుత్తూరురూరల్, నవంబర్ 30 ప్రభాతవార్త:** డిసెంబరు 1 ఆదివారం కావడంతో ఆ నెల పెన్షన్ని ఒక రోజు ముందుగానే నవంబరు 30న శనివారం రోజు లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తడుకు సర్పంచ్ బొబ్బిలి తెలిపారు. పుత్తూరు రూరల్ మండలం తడుకు గ్రామ పంచాయతీ మజ్జిగ గుంట, ఎస్టీ కాలనీలో లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్ తులసి, అంగన్వాడీ టీచర్ లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.

## ఎడ తెరపి లేని వర్షం

**పుత్తూరురూరల్, నవంబర్ 30 ప్రభాతవార్త:** ఫెంగల్ తుఫాను తీవ్రతారం చూపింది. శనివారం నియోజకవర్గంలో సరాసరిగా సెం.మీ వర్షపాతం నమోదైంది. ఉదయంనుంచి రాత్రి వరకు గాలులు, వర్షం కురిసింది. లో తటు ప్రాంతాలు జలమయమైంది. పలు ప్రాంతాల్లో పొలాలపై నీరు నిలిచింది. లో తట్టు ప్రాంతాలు నీటమునిగి ఇబ్బందులు పడ్డారు.

## ప్రొఫెసర్ దేవ ప్రసాదరాజుకు సన్మానం



**తిరుపతి విద్య నవంబర్ 30 ప్రభాతవార్త:**ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ బి దేవ ప్రసాద్ రాజును నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ విజయభాస్కర రావు శనివారం ఘనంగా సత్కరించారు.ఫిజిక్స్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ దేవ ప్రసాదరాజు ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనను వీసీ వర్సిటీలో కలసి అభినందనలు తెలిపి పుష్పగుచ్చం అందించి,జ్ఞాపికతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆర్వీ విజయలక్ష్మి,అధ్యాపకులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధి నివారణ



**తిరుపతి విద్య, నవంబర్ 30 ప్రభాతవార్త:** ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉన్నప్పుడే నివారణ సాధ్యమని ఎస్వీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ తెలిపారు.శనివారం పద్మావతి డిగ్రీ కళాశాలలో డిసెంబర్ 1వ తేదీ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవహారం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి హెచ్ఐవీ వైరస్ ద్వారా సంక్రమిస్తుందని,వ్యక్తిగత క్రమశిక్షణ, మంచి అలవాట్లతో ఇటువంటి వ్యాధులు సోకకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ దివ్యవాణి,కామర్స్ విభాగాధిపతి డాక్టర్ మల్లేశ్వరి దేవి,అధ్యాపకులు కెవి పద్మజ,నళిని,కుమిదిని,కస్తూరి,సుధాకర్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఆలయంలో మండలాభిషేక పూజ



**వెదురుకుప్పం, నవంబర్ 30 ప్రభాతవార్త :** శ్రీకృష్ణ సమేత ధర్మరాజుల ఆలయంలో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు మహా సంప్రోక్షణ మండలభిషేక పూజ జరుగుతుందని ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. మహా సంప్రోక్షణ పూజలలో భాగంగా శనివారం ఉదయం ఆలయంలో పురోహితులు గౌరీశంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మహాసంప్రోక్షణ మండలాభాషేక పూజలు ఆదివారం సాయంత్రం ఆరు గంటల నుండి గణపతి పూజ, హోమం, కలసపూజ, మూలవార్లకు అభిషేకం హారతి తీర్థప్రసాదాలు ఉంటుందన్నారు. ఉభయదాతగా మాజీ ధర్మకర్త బండి ఉమాపతిరెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు.

## ఎడతెరిపి లేకుండా కురుసున్న వర్షం

**వెదురుకుప్పం, నవంబర్ 30 ప్రభాతవార్త :** ఫెంగల్ తుఫాన్లో భాగంగా శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా మండలంలో విస్తరంగా వర్షాలు కురుస్తుండటంతో జన జీవనం స్తంభించి పోయింది. దీంతో ప్రజలు పనులకు అడ్డంకులు ఏర్పాడ్డాయి. రోజంతా ప్రజలు ఇండ్లకే పరిమితమైన్నారు. కేవలం అత్యవసరాలు ఇంటి నుంచి బయటకు వెళ్ళారు.

## స్విమ్స్లో ప్రపంచ ఎయిడ్స్ డే



**తిరుపతి హెల్త్, నవంబర్ 30 ప్రభాతవార్త :** శ్రీ వేంకట్వేర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని శనివారం శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల లెక్చరర్ గ్యాలరీలో ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు , ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్, మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉషాకళావత్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. నాగరాజ్, ఫిజియోథెరపి కాలేజి ప్రిన్సిపాల్ డా కె. మాధవి, నర్సింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొ.స్వర్ణల సంయుక్తంగా జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దే ను ప్రతి ఏటా డిసెంబర్ 1వ తేదిన నిర్వహిస్తారని, విద్యార్థులు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకొని ఎయిడ్స్ రహిత దేశంగా రూపుదిద్దుకొనేందుకు కృషి చేయలని పిలుపు నిచ్చారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. నాగరాజ్ మాట్లాడుతూ ఎయిడ్స్ కేసులలో ఆంధ్రప్రదేశ్ మూడవ స్థానంలో వుందని, చాలా మంది అవగాహన లోపం వల్ల ఎయిడ్స్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఎయిడ్స్ వ్యాధిని అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డా.జి. నిహల్ జూనియర్ రెసిడెంట్, డా.చంద్రశేఖర్ అసోసియేట్ ప్రొఫెసర్, డా. లలిత్ అసిస్టెంట్ ప్రొఫెసర్, డా. ఐశ్వర్య నోడల్ ఫ్యాకల్టీ, డా. అజిత పి.జి., వైద్య విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ కారణంగా పలు విమానాలు రద్దు

**రేణిగుంట, నవంబర్30 ప్రభాతవార్త :** రేణిగుంట (తిరుపతి) అంతర్జాతీయ విమానాశ్రయం నుండి రాకపోకలు సాగించాల్సిన 13 విమాన సర్వీసులను ఫెంగల్ తుఫాన్ వల్ల విపరీతంగా కురుస్తున్న వర్షాలకు రద్దు చేశారు. రేణిగుంట విమానాశ్రయం నుండి ప్రతిరోజు 15విమాన సర్వీసులు ప్రయాణికులకు సేవలందిస్తాయి. తుఫాన్ వల్ల ఉదయం ఒక విమానం రాత్రికి మరో విమానం తప్ప మిగిలిన 13 విమాన సర్వీసులను రద్దు చేసినట్టు విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. తుఫాను తీవ్రత తగ్గేవరకు విమాన సర్వీసులు సేవలందించవని విశ్వసనీయ సమాచారం. విమాన సర్వీసులు రద్దు కావడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కున్నారు.

## మల్లెమడుగు డ్యాంకు భారీగా వరద నీరు



**రేణిగుంట, నవంబర్ 30 ప్రభాతవార్త :** రేణిగుంట మండలం మల్లెమడుగు డ్యాంకు ఫెంగల్ తుఫాన్ వల్ల కురుస్తున్న విపరీతమైన వర్షాలకు శనివారం భారీగా వరద నీరు చేరుకుంది. ఓవైపు వర్షాలు మరోవైపు తిరుమల కొండలపై నుండి దిగువకు వస్తున్న నీరు మల్లెమడుగు డ్యాంకు చేరుకుంటుంది. మల్లెమడుగు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రమోళి, జూనియర్ ఇంజనీర్లు ముని శంకర్, రాజా, బాల పరంధాం, ప్రకాష్ లు డ్యాం కు సంబంధించిన 14 గేట్లలోని రెండు గేట్లను ఒకటిన్నర అడుగులు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. డ్యాంకు ఇన్ఫ్లో 352 క్యూసెక్కుల నీరు వస్తుండగా అవుట్ ఫ్లో 450 క్యూసెక్కులు నీరు విడుదల చేశారు. రాత్రికి ఇన్ఫ్లో పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. డ్యామ్ సామర్థం 01.181 టీఎంసీలు. ప్రస్తుతం డ్యాంనందు 0.179 నీరు ఉంది. రాత్రికి నీరు ఎగువ ప్రాంతాల నుండి అధికంగా వచ్చే సూచనలు ఉన్న నేపథ్యంలో రేణిగుంట తహసిల్దార్ సురేష్ బాబు లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.

# తిరుపతి డివిజన్

## చిన్నబ్బనాయుడుకి కన్నీటి వీడ్కోలు



**పాకాల, నవంబర్ 30 ప్రభాతవార్త :** పాకాల మండలం దామలచెరువు పంచాయతీ మొగరాల గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు చలపతి నాయుడు తండ్రి చిన్నబ్బ నాయుడు మృతి చెందిన విషయం తెలిసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కూటమి నాయకులతో కలిసి చిన్నబ్బ నాయుడు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని తెలిపారు

## జోరు వానలో ఆగని ఫించన్ పంపిణీలు

**పాకాల, నవంబర్ 30 ప్రభాతవార్త :** పాకాల మండలం పాకాల పంచాయతీ గాంధీనగర్లో ఎమ్మెల్యే పులివర్తి నాని కూటమి పార్టీ మండల నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పెన్షన్దారులు ఇంటి వద్దనే ఉండి పెన్షన్ తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజల కష్టాలను,సమస్యలు తెలిసినవారు కాబట్టే మా పెద్దాయన చంద్రబాబు నాయుడు ఒక్క రోజు ముందు పెన్షన్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్తో అప్రమత్తత అవసరం




**పాకాల నవంబర్ 30 ప్రభాతవార్త :** పాకాల మండలంలోఎయిడ్స్ వ్యాధి పట్ల అప్రమత్తతతో మెలగాల్సి న అవసరం ఉందని పాకాల సివిల్ కోర్ట్ న్యాయమూర్తి పూర్ణిమాదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్, ఆర్.సి.సిల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని ప్రసంగిం చారు. డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎ. మొహిద్దీన్ భాష మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సి న ప్రధాన బాధ్యత యువతపై ఉందన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి రావడానికి గల కారణాలను, నివారణ మార్గాలను, చికిత్స గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రమేష్ కుమార్ ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్, ఆర్.సి.సి, అధికారులు ఈశ్వరబాబు, మసులామణి, చిట్టి కళావతి, న్యాయవాదులు సలీం భాష,చంద్రమోహన్, ప్రవీణ్, ప్రకాష్, అనూష అధ్యాపకులు మెడికల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## స్విమ్స్కు రూ.10 లక్షలు విరాళం



**తిరుపతి హెల్త్, నవంబర్ 30 ప్రభాతవార్త :** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆసుపత్రికి హైదరాబాద్ నగరానికి చెందిన ఇడిముక్కల హాసిని 10 లక్షల రూపాయిలు విరాళాన్ని డి.డి రూపంలో శనివారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో స్విమ్స్ సంచాలకులు ఉపకులపతి డా ఆర్.వి.కుమార్కి అందజేశారు. ఇడిముక్కల హాసిని మాట్లాడుతూ మా తాతగారు అయిన కీ. శే. ఇడిముక్కల యతిరాజయ్య జ్ఞాపకార్థం స్విమ్స్ ఆసుపత్రికి పది లక్షల రూపాయలు విరాళం అందజేశానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డిప్యూటి డైరెక్టర్ (బిల్లింగ్ సెక్షన్) సురేష్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు పరిశీలించిన కమిషనర్



**తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 30 ప్రభాతవార్త :** పెంగల్ తుఫాను వలన కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం తెల్లవారుజామున నగరంలోని అన్నమయ్య కూడలి, కలెక్టర్ బంగ్లా రోడ్డు, ముత్యాలరెడ్డి పల్లి, వెస్ట్ చర్చి రోడ్డు తదితర ప్రాంతాల్లో జోరు వానలో పారిశుద్ధ్య పనులను హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పెంగల్ తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని అన్నారు. తుఫాను వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా కంట్రోల్ రూమ్ నంబర్ 0877 2256766ను సంప్రదించాలని కమిషనర్ ప్రజలను కోరారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, తుడా ఈ.ఈ.రవీంద్ర, డి.ఈ.మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

## బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ అందరి లక్ష్యం

**కేవీబీ పురం, నవంబర్ 30 ప్రభాతవార్త:** బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ మనందరి లక్ష్యంగా పనిచేయాలని పిచ్చాటూరు ప్రాజెక్టు ఐసీడీఎస్సూపర్వైజర్ సుమతి అన్నారు. మండలంలోని అంజూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు వలన జరుగు అనర్థాల గురించి వివరించారు. యువక్త వయసు రాకుండా పెళ్లి చేసినా లేక పెళ్లి ప్రయత్నాలు చేసినా వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీధర్, ఉపాధ్యాయులు రమాదేవి, లావణ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ కాలేశా, నవీన్లు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి జియో ట్యాగ్ చేయండి

**కేవీబీపురం, నవంబర్30 ప్రభాతవార్త:** మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో మండల అభివృద్ధి అధికారి రాధారాణి పంచాయతీ కార్యదర్శు లకు, సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని కేవీబీ పురం, కళత్తూరు, తిమ్మ సముద్రం, కోవనూరు సచివాలయాలను తనిఖీ చేసి జియో ట్యాగ్వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందాలంటే వారి వ్యక్తిగత పునరుద్ధరణ (యాక్టివేషన్) లో ఉండేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు.

## వ్యక్తిగత శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

**కేవీబీ పురం, నవంబర్ 30 ప్రభాతవార్త:** వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కేవీబీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి వాణి అన్నారు. మండలకేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థినులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి వాణి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో అనేక రకాలైన అంటు వ్యాధులకు దూరంగా ఉండొచ్చని తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు సుబ్బలక్ష్మి, పాఠశాల ప్రత్యేక అధికారి సుకన్య, ఏఎన్ఎంలు, ఆరోగ్య కేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎడతెరపి లేని వర్షం

**కేవీబీ పురం, నవంబరు 30 ప్రభాతవార్త:** ఫెంగల్తుఫాను తీవ్రతాపం చూపింది. కేవీబీ పురం మండలంలో ఉదయం నుంచి రాత్రి వరకు గాలులతో వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో పొలాలపై నీరు నిలిచి, లో తట్టు ప్రాంతాలు నీటమునిగాయి. మండలంలోని అంజూరుపాళెం, జయలక్ష్మీపురం మధ్య రోడ్డు వర్షాల కారణంగా రోడ్డు కొట్టుకుపోయింది. పరిసర ప్రాంతాల్లో పెను గాలులతో కూడిన వర్షం శనివారం రాత్రి వరకు పడుతోంది.

## పేదలకు అన్నదానం

**నారాయణవనం, నవంబర్ 30 ప్రభాతవార్త :** సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం మండలం వైకాపా సీనియర్ నాయకులు, పెద్దాయన పెల్లెటి సుదర్శన్రెడ్డి పేరుతో శనివారం అన్నదాన ం కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని తాతా సొరకాయలుస్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం నిరుపేదలకు అన్నదానం కార్యక్రమాన్ని అతని కుమారులు పి సుదాకర్రెడ్డి, పి దివాకర్రెడ్డిలు అందించారు.వైకాపా నేతలు నూకతోటి రాజేష్, బీరేంద్రవర్మ, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, అన్నాదొరై, రాకేష్ కిరణ్, గురుస్వామి, మణిరెడ్డి, హేమచంద్రారెడ్డి. సుబ్రమణ్యంయాదవ్, మనోహర్, దిల్లీ, మోహన్, సొరకాయులు, దొరైరాజ్, మురళి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పెంగల్ తుఫ్యాన్తో కురుస్తున్న భారీవర్షం



**నారాయణవనం, నవంబర్ 30 ప్రభాతవార్త :** బంగాళాతంలో ఏర్పడిన పెంగల్ తుఫాన్తో కురుస్తున్న భారీ వర్షంతో జన జీవనం పరిస్థితి అస్థవ్యస్థంగా మారింది. కురుస్తున్న భారీ వర్షంతో చెరువులకు నీరు చేరుతున్నది. దీంతో రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తున్నది. రైతులు ఆనందం వ్యక్త పరుస్తున్నప్పటికి కురుస్తున్న భారీ వర్షంతో మూగజీవులకు సైతం ఓ పక్క మేత మరోపక్క చలితో అల్లాడిపోతున్నది. వర్షం నీటితో రోడ్డుపై నీళ్ల నిలవడం వల్ల ఇళ్లలోకి నీళ్లు చేరడంపై ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కురుస్తున్న వర్షంతో తిరువట్యం, సముదాయం, తుంబూరు. పాలమంగళం బ్రిడ్జిలపై నీటి ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం కలుగుతున్నది.

## వర్షంతో కోన జలపాతానికి జల కళ

**నారాయణవనం, నవంబర్ 30 ప్రభాతవార్త :** తుఫాన్ వర్షంతో కైలాసకోన జలపాతం సుమారు సుమారు 25 అడుగుల ముందుకు వచ్చి దుముకుతున్నది. శుక్రవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జలపాతం ఉధృతంగా ప్రవహించడంతో పర్యాటకులు జలపాతంలో స్నాన ం చేయడానికి పోటీ పడుతున్నారు. నడింకోన, శింగిరికోనలోను జలపాతం ఉధృతంగా ప్రవహిస్తున్నది. కైలాసకోన, శింగిరికోన జలపాతంలో పర్యాటకుల సంఖ్య కార్తీక మాసంతో మరింత పెరిగింది.

## ఉన్నత విద్యారంగ సమస్యలను పరిష్కరించండి



**తిరుపతివిద్య, నవంబర్ 30 ప్రభాతవార్త:** ఏపీలో ఉన్నత విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహా సంఘం(ఏబిఆర్ఎస్ఎం)రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి విన్నవించారు.ఈ మేరకు శని వారం ఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వైస్ ఛైర్మన్ ప్రొఫె సర్ దీపక్ కుమార్ శ్రీవాస్తవ్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని,17 వర్సిటీలకు పూర్తి స్థాయి వీసీలను నియమించాలని కోరారు. యూజీసీ వైస్ చైర్మన్ సానుకూలంగా స్పందించి పరిష్కారానికి

# గూడూరు డివిజన్

## దళిత ఉద్యమనేత ఆర్.వి.రమణయ్య కన్నుమూత



కోట,నవంబర్ 30 ప్రభాతవార్త : లోక హితమే అభిమతంగా నీతి నిజాయతీలను ప్రభోధించిన దళిత ఉద్యమనేత ఆర్.వి.రమణయ్య (65) తన ఉద్యమాలతో సమాజాన్ని మేల్కొలిపే ప్రయత్నం చేశారు. సమాజంలోని అన్యాయాలు, అక్రమాలను అసమానతలపై ఆయన తనదైన శైలిలో పోరాటం సాగించారు. ఆయన శుక్రవారం రాత్రి కోటలో కన్ను మూశారు. దీంతో ఆయన ఇక లేరని వార్త తెలుసుకున్న దళితులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, రాజకీయ ప్రముఖులు, ప్రజా సంఘాలు,దళిత సంఘాలు తరలి వచ్చి ఆయన భౌతికాయానికి ఘనంగా నివాళిర్పించారు.ఆయన అనేక భూ పోరాటాలు చేసి, ఏంతో మంది భూస్వాములు చేతుల్లో ఉన్న పేదల భూములను స్వాధీనం చేసుకుని పేదలకు అందచేశారు. పేద ప్రజలకు అండగా నిలిచి ప్రజలు హృదయాల్లో ఆర్.వి.రమణయ్య నిలిచిపోయారని పలు ప్రజా సంఘాలు నాయకులు పేర్కొన్నారు.ఆయన కుటుంబ సభ్యుకు ప్రగాడ సానుభూతి తెలిపారు.

## మత్స్యకారుల గుండెలల్లో దడ

కోట,నవబర్ 30 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో వాయుగుండం తీవ్రరూపం దాల్చిన నేపధ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు. మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలో పెద్దగొవిందపల్లె సముద్ర తీరంలో అలలు ఎగిసి పడుతూ ఈదురు గాలులు బలంగా వీస్తున్నాయి. దీంతో వారు తమ పడవలను ఒడ్డుకు చేర్చారు. తీరం వెంబడి సూమరు 50 కి.మీ వేగంతో గాలు వీస్తున్నాయి. భారీ వర్షాల నేపధ్యంలో తీరం వెంబడి నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని సర్పంచ్ తిరుపాలయ్య,విఆర్ఓలు కోరారు.

## జోరు వర్షంలో ఫించన్ల పంపిణీ



కోట,నవంబర్ 30 ప్రభాతవార్త : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా శనివారం కోట మండలంలో జోరు వర్షంలో సైతం లబ్దిదారుల ఇళ్లకు సచివాలయ ఉద్యోగులు వేళ్లి పంపిణీ చేశారు.ఈ సారి డిసెంబర్ 1న ఆదివారం సెలవు దినం కావడంతో ఒక రోజు ముందే పేదల ఇంటంటికి వెళ్లి పింఛన్ల సొమ్ము ను పంపిణీ చేసినట్లు ఎంపిడివో వేణు తెలిపారు. కోత్తపట్నంలో తెదేపా టిఎన్‌టిసీ సెల్ గూడూరు నియోజకవర్గం అద్యక్షులు చెంగల్‌రావు మాట్లాడుతూ ప్రతి కుటుంబం అనందంగా సంతోషంగా ఉండాలనిదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కోటలో తెదేపా జిల్లా కార్యదర్శి తూపిలిరాధాకృష్ణారెడ్డి చేతుల మీదగా పంపిణీ చేశారు.

## పరిశ్రమల్లో కార్మికులకు 1న జీతాలు ఇవ్వాలి

కోట,నవంబర్ 30 ప్రభాతవార్త : గూడూరు నియెజవర్గంలోని ఏన్నో పరిశ్రమల్లో వందలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని గూడూరు నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అద్యక్షులు చెంగల్‌రావు చెప్పారు. ఆయన శనివారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ నియోజక్గంలోని ఒక్క పరిశ్రమ కూడా ప్రతి నెలా ఒకటో తేదీన కార్మికులుకు జీతాలు చెల్లించడ లేదని ఆయన ఆరోపించారు.కంపెనీ లాభాల కొరకు రాత్రి బవళ్ల కార్మికులు ఆయా ప్యాక్టరీల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల మాదదిరిగానే కార్మికులు కూడా 1నే జీతాలు ఇవ్వాలన్నారు. కార్మిక చట్టం ప్రకారం ఒకటో తేదిన జీతాలు చెల్లించకపోతే శాసన సభ్యులు పాశిం సునిల్ కుమార్ దృష్టికి తీసుకొనిపోతామన్నారు.

## పెన్షన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రామకృష్ణ



వెంకటగిరి, నవంబర్ 30 ప్రభాతవార్త : పట్టణం లోని రాణి పేట చింతగుంట లలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పంపిణీ చేశారు. ఉదయం 6 గంటలకే ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్లను అందజేశారు. ఆదివారం ఒకటో తేదీ వచ్చినందున శనివారం అందరికీ పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే స్థానికులకు తెలిపారు. జోరు వానలో కూడా పెన్షన్లను పంపిణీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. 10 లక్షల 50వేల రూపాయల సీఎం సహాయనిది చెక్కులను అందజేశారు. వైసిపి ప్రభుత్వం పేదల విస్మరించిందని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో కోటేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కె వి కె ప్రసాద్ నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమోళి రెడ్డి తదితరులు ఉన్నారు.

## డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తా : ఎమ్మెల్యే



వెంకటగిరి, నవంబర్ 30, ప్రభాతవార్త ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. 200 మంది వరకు కిడ్నీ పేషెంట్లు ఉన్నట్లు వీరు నెల్లూరు వెళ్తున్నారని ఇక్కడే ఏర్పాటు చేస్తే పరీక్షలు చేసుకుంటారని తెలిపారు. 24 గంటలు ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధికి కావలసిన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిస్తానని చెప్పారు. సమావేశంలో డాక్టర్ జిలాని భాష, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు ఆసుపత్రి కమిటీ సభ్యులు రాధమ్మ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్ర మోలి రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కె వి కె ప్రసాద్ నాయుడులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన



వాకాడు, నవంబర్ 30 ప్రభాతవార్త : మండల కేంద్రమైన వాకాడులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శనివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉద్దేశించి సీఐ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల దశలోనే చదువు, క్రీడల్లోనే నైపుణ్యత సాధించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సిఐ బాలకృష్ణ, ఎగ్ కానిస్టేబుల్ రాజయ్య, రాధాకృష్ణ, కానిస్టేబుల్స్ పి వెంకటేశ్వర్లు, రమణయ్య, పోలయ్య తదితరులు ఉన్నారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

వాకాడు, నవంబర్ 30 ప్రభాతవార్త : వాకాడు మండలం ఆముదాలపాడు లో శనివారం బెల్ట్ షాప్ నందు ఎన్ గోపీనాథ్ మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ సీఐ ప్రసాద్ అరెస్ట్ చేశారు. మద్యం విక్రయిస్తున్న గోపీనాథ్ వద్ద 10 మద్యం క్వార్టర్ బాటిల్‌లను సీఐ ప్రసాద్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి గోపీనాథ్‌ను అరెస్ట్ చేశారు.

## వైద్యశాలను పరిశీలించిన ఎంపీడీవో



వాకాడు, నవంబర్ 30 ప్రభాతవార్త : మండల కేంద్రమైన వాకాడులో ఉన్న ప్రభుత్వ వైద్యశాల భవనంను శనివారం ఎంపీడీవో అన్నపూర్ణరావు పరిశీలించారు. శుక్రవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షంకు ఆసుపత్రిలోని గదుల్లో వర్షపు నీరంతా రావడంతో ఎంపీడీవో క్షుణ్ణంగా పరిశీలించారు, వైద్యులు సిబ్బంది తీవ్ర అసౌకర్యంగా ఉన్న వైద్య సేవలు అందిస్తున్నామన్ని ఎంపీడీవోకి వైద్య సిబ్బంది సూచించారు. ఆస్పత్రి పరిస్థితులను, నూతనంగా నిర్మించిన ఉన్న నూతన భవనంలోకి వైద్యశాలను తరలించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీవో అన్నపూర్ణ రావు, వైద్య అధికారులకు తెలిపారు.

## వృద్ధులకు ఎంపీడీవో పింఛన్ పంపిణీ

వాకాడు, నవంబర్ 30 ప్రభాతవార్త : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే భారీ వర్షంలో శనివారం ఎంపీడీవో అన్నపూర్ణ రావు చేతుల మీదుగా వృద్ధులకు పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ 5311 మంది లబ్ధిదారులు ఉండగా 90 శాతం పెన్షన్ కార్యక్రమం జరిగిందన్నారు.

## భారీ వర్షం...జల ధిగ్బందానికి గురైన దహదారులు

**-డి.వి సత్రంలో 110.8 సెం.మీ గా నమోదైన వర్షపాతం.**

దొరవారిసత్రం, నవంబర్ 30 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలంలో శనివారం భారీ వర్షం కారణంగా మండల తహశీల్దారు,యంపిడిఓ అధ్యక్షతన మండల కేంద్రంలో కంట్రోలు రూము ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతాలలో వర్షం ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ శనివారం సుమారు 110.8సెం.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు.

## జోరు వానలోనూ పింఛన్లు పంపిణీ

సూళ్లూరుపేట, నవంబర్ 30 ప్రభాతవార్త : ఒకవైపు జోరు వాన కురుస్తున్నా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శనివారం ఉదయం మన్నారుపోలూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా కింద అందిస్తున్న పింఛన్లను మూడు నెలల తర్వాత కూడా ప్రస్తుతం తీసుకోని వారు తీసుకోవచ్చని తెలిపారు. కొత్తగా పింఛన్లకు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, కమిషనర్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## మ్యాజిక్ బస్ సంస్థచే స్పోర్ట్స్ ఫెడరేషన్ సమావేశం



సూళ్లూరుపేట, నవంబర్ 30 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామంలో మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో మోడలేజ్ ఇండియా ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో శనివారం సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లా కబడ్డీ, వాలీబాల్ అసోసియేషన్ సభ్యులతో గూడూరు, చిట్టమూరు, సూళ్లూరుపేట, తడ, వరదయపాలెం, సత్యవేడు, బిఎన్‌కండ్రిగ మండలాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులతో 36 పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. మ్యాజిక్ బస్ సంస్థ మేనేజర్ ఆనంద్ మాట్లాడుతూ ఈ సంవత్సరంలో 20 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌డిఎఫ్ పోటీల్లో పాల్గొనేందుకు కోచింగ్ క్యాంప్ నిర్వహించామన్నారు. ప్రధానోపాధ్యాయులు చంద్రజిత్ యాదవ్, కోఆర్డినేటర్లు భాస్కర్, కరిముల్లా, శివకుమార్, మహిపాల్, వెంకటసుబ్బయ్య, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేట మండల సర్వసభ్య సమావేశం



సూళ్లూరుపేట, నవంబర్ 30 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో మండల సర్వసభ్య సమావేశం శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పారిశుధ్య పనులను మెరుగుపరిచి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట్ల మండల పరిధిలోని అధికారులు, కార్యదర్శులు భారీ వర్షాల్లో చిక్కుకున్న వారికి సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రమీలరాణి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఎ.చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత సిఎం దే : ఎమ్మెల్యే



గూడూరు, నవంబర్ 30 ప్రభాతవార్త : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు గెలిచిన వెంటనే పెన్షన్లను పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుది అని గూడూరు ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్ కొనియాడారు. శనివారం గూడూరు పట్టణంలోని రెండవ వార్డులో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, నాయకులు పెన్షన్లను అందజేశారు. వర్షంలో తడుస్తూ ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు నగదును అందజేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గం 37 వేల 669 పెన్షన్లు ఇస్తున్నామని ప్రతి వార్డులో గతంలో టిడిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప గత వైసిపి ప్రభుత్వంలో ఏమి జరగలేదని వెల్లడించారు. పార్టీలకతీతంగా పేద వారందరికీ పెన్షన్లు అందజేస్తామని గత వైసిపి ప్రభుత్వం లాగా కక్ష సాధింపు చర్యలు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సిఐ శేఖర్ బాబు, నాయకులు బిల్లు చెంచురామయ్య ,అల్లి భాష ,రహీం, ఇజ్రాయిల్, జహంగీర్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా హాస్పిటల్ అభివృద్ధి సహకరించండి

**-హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్, సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీన**



గూడూరు, నవంబర్ 30 ప్రభాతవార్త : ఏరియా ఆసుపత్రి అభివృద్ధి ప్రతి ఒక్కరు సహకరించాలని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్, సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీన పేర్కొన్నారు. శనివారం గూడూరు ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మెన్‌గా హాస్పిటల్ నందు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీన కమిటీ సభ్యులతో మొదటి సమావేశం ఏర్పాటు చేసి హాస్పిటల్ అభివృద్ధి కొరకు తీసుకోవలసిన అజాండాలపై చర్చ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారులు నాయకులు గ్రామాల్లో పెంగల్ తుఫాను కారణంగా లోతట్టు ప్రాంతాల గ్రామాల్లో పునరావస కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహాయ చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా సూచన సంస్థల వారు కూడా ముందుకొచ్చి వారి సహాయ సహకారాలు చేపట్టాలన్నారు. అదే విధంగా మత్స్యకారులు ఎవరు సముద్రంలోకి వేటగా వెళ్లకుండా ఇంటి వద్ద ఉండాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ఏ గ్రామాల్లో ఏ సమస్యలు ఉన్నాయో పై స్థాయి అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. గూడూరు నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పేద ప్రజలకు ఆహారం అందించేందుకు ముందు ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, హాస్పిటల్ సూపరింటెండెంట్ షరీనా, నాయకులు బిల్లు చెంచురామయ్య, పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, గుండాల భారతి, గాలి బాలకృష్ణ నాయుడు, పట్టణ సీఐ శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వర్షంలో సైతం ఫించన్లు పంపిణీ



చిల్లకూరు, నవంబర్ 30 ప్రభాతవార్త : ఎన్టీఆర్ పింఛన్ భరోసా కార్యక్రమంలో భాగంగా గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు పెద్దలు, ప్రముఖ పారిశ్రామికవేత్త, పెంచలకోన మాజీ ట్రస్ట్ చైర్మన్ తానంకి నానాజీ సూచనలు మేరకు చిల్లకూరు మండలంలోని చిల్లకూరు గ్రామం నందు ఎన్టీఆర్ పింఛన్ భరోసా కార్యక్రమం సచివాలయం సిబ్బందితో కలిసి అన్ని గ్రామ పంచాయితీలో నాయకులు, అధికారులు భారీ వర్షంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి చిల్లకూరు పట్టాభి రెడ్డి, యూనిటీ ఇన్చార్జ్ కొండా రామచంద్ర రెడ్డి, నాయకులు దాసరి రాంప్రసాద్ యాదవ్, బూత్ ఇంచార్జ్ నాయకులు కాటూరి నవీన్ చంద్ర, జగదీష్ పవన్, శివ గౌడ్, మురళి గ్రామ పార్టీ నాయకులు ఆమారి సీనయ్య, వేములూర్ సుబ్బారావు, కాటూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గూడూరులో ఎడతెరపు లేని వర్షం

గూడూరు, నవంబర్ 30 ప్రభాతవార్త : ఫెంగల్ తుఫాను ప్రభావంతో గూడూరు పట్టణంలో రాత్రి నుండి ఎడతెరపు లేకుండా వర్షం కురుస్తుంది. ఆదివారం మహాబలిపురం వద్ద తుఫాను తీరం దాటవచ్చని వాతావరణ శాఖ ప్రకటించారు. దీంతో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని తెలపడంతో అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మరోవైపు చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వయోవృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## విపత్తు సంభవిస్తే... ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

చిల్లకూరు, నవంబర్ 30 ప్రభాతవార్త : ఫెంగల్ తుఫానుతో చిల్లకూరు మండలంలో మరో మూడు రోజులు వర్షాలు ఉంటాయని, వాతావరణశాఖ తెలిపిందని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ శ్రీనివాసులు వెల్లడించారు. వీఆర్వోలు, తలారులు లోతట్టు ప్రాంత గ్రామాల్లో సహచరులు ప్రజలకు చేపట్టాలని వారు తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు ఇంటికి పరిమితం కావాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలాగే తాసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని సమస్యలు ఏమైనా ఉంటే ఈ నెంబర్ 9989502067 తెలియజేయాలని కోరారు. అదే విధంగా గూడూరు డి.ఎస్.పి రమణ కుమార్ ఆదేశాలతో రూరల్ సిఐ కిషోర్ బాబు, చిల్లకూరు ఎస్సై సురేష్ బాబులు లోతట్ట ప్రాంత గ్రామాల్లో సిబ్బందిని ఏర్పాటు చేసి ఎలాంటి ఆవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

## జిఎస్టి టాక్స్‌పై వ్యాపారస్తులు అవగాహన పెంచుకోవాలి

గూడూరు, నవంబర్ 30 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని జిఎస్టి టాక్స్ లో అనేక మార్పులు వస్తున్నాయని, వాటిపై వ్యాపారస్తులందరూ అవగాహన పెంచుకోవాలని నిబంధనల మేరకు ఇన్టైంలో రిటర్న్లు ఫైల్ చేయాలని గూడూరు సర్కిల్ వాణిజ్య పన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్ అరుణకుమారి సూచించారు. గూడూరు పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ అరుణ కుమారి జీఎస్టీ నిబంధనలపై వ్యాపారస్తులతో అవగాహన సమావేశం నిర్వహించారు. టాక్స్ లకు సంబంధించి పలు అంశాలపై వ్యాపారస్తులతో చర్చించారు. ఈ సమావేశంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ప్రమీల,వ్యాపార యూనియన్ నాయకులు సోమిశెట్టి చెంచురామయ్య, చంద్రశేఖర్,కోట సునీల్ కుమార్,సుధాకర్, భాస్కర్, ప్రసాద్,కోటా రామారావు, రాంప్రసాద్,ఎస్ ఎల్ ఎన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

### తొలకరి చినుకుల నడుమ...

## ముత్యాలపందిరిపై శ్రీ మహాలక్ష్మి

**- వర్షంలో సైతం భక్తులను అలరించిన కళాకారులు**



తిరుచానూరు, నవంబర్ 30 ప్రభాతవార్త : ముత్యపు పందిరిపై ఆదిలక్ష్మి అలంకారంలో శ్రీ మహాలక్ష్మి దేవి భక్తులకు అభయమిచ్చారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శనివారం ఉదయం ముత్యపుపందిరి వాహనంపై ఆదిలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. ఇందులో భాగంగా అమ్మవారిని సుప్రభాతంతో మేలుకొలిపి సహస్రనా మార్చన, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం ఉత్స వర్లను వాహనం మండపంకు వేంచేపు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం తిరువీధులో తులకరి చినుకుల నడుమ ముత్యాల పందిరిపై భక్తులను అనుగ్రహించింది. పెద్ద సంఖ్యలో భక్తులు కర్పూర నీరాజనాలతో అమ్మవారి అనుగ్రహానికి పాత్రులైనారు. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో జె శ్యామల రావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈఓ దేవరాజులు,ఆలయ అర్చకులు బాబు స్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుభాష్, చలపతి, ఏవియస్ఓ సతీష్ పాల్గొన్నారు.













## ఆరోగ్యమే మహాభాగ్యం

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు**



చిత్తూరు, నవంబర్ 30 ప్రభాతవార్త: ఆనందమే ఆరోగ్యం, ఆరోగ్యమే మహాభాగ్యం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు సిబ్బందికి ప్రైవేటు విన్ హెల్త్ ఆసుపత్రి ద్వారా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం కార్యక్రమంకు ముఖ్య అతిధిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇన్‌ఛార్జీ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎంవిఎన్ పద్మజ, 1వ అదనపు జిల్లా జడ్జి ఎస్.రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.బీమారావు మాట్లాడుతూ శరీరం, మనస్సు రెండింటి యొక్క మంచి ఆరోగ్యం జీవితంలో విజయవంను పొందడానికి, దానిని పూర్తి స్థాయిలో ఆనందించడానికి సహాయపడుతుందన్నారు. మానసిక ఆరోగ్యం అందరికి శ్రేయస్కారం అన్నారు. ఆరోగ్యకరమైన జీవితం శారీరక బలంను, విశ్వాసంను కల్పిస్తుందన్నారు. మంచి శారీరక ఆరోగ్యం మన కష్ట సమయాల్లో మనకు సహాయపడుతుందని, పేలవమైన శారీరక బలహీనత వ్యాధులకు గురవుతుందన్నారు. ఆరోగ్యంగా ఆనందంగా వుండటం వల్ల దినచర్య కార్యక్రమాలతో పాటు ఉద్యోగం సక్రమంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందన్నారు. 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు శరీరంను చెక్ చేసుకోవాలని, దీనివల్ల రానున్న పరిస్థితులను ముందుగానే తెలుసుకోవచ్చునన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేంద్రరెడ్డి మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు సిబ్బంది, న్యాయవాదులకు ఉచితంగా వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవిశంకర్, జిల్లా ఫోక్స్ కోర్టు జడ్జి ఎన్.శాంతి, అదనపు సివిల్ జడ్జి డి.వెన్నిలా, 3వ అదనపు సివిల్ జూనియర్ జడ్జి శ్రీనివాసులు, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ నవీన్, డాక్టర్ రమేష్, సీనియర్, జూనియర్ న్యాయాధికారులు, కోర్టు సిబ్బంది, విన్ హెల్త్ ఆసుపత్రి వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో స్వర్ణముఖిలో బిల్వాలు,కుంకుమ నిమజ్జనం



శ్రీకాళహస్తి,నవంబర్ 30 ప్రభాతవార్త : పది రోజుల పాటు భక్తి శ్రద్దలతో స్వామికి బిల్వార్చన, అమ్మ వారికి కుంకు మార్చనలు శనివారంతో ముగిసాయి. ప్రతి ఏడాది కార్తీక మాసంలో నిర్వహించే ఉత్సవాల్లో 'స్వామికి లక్ష బిల్వార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన'లు ప్రత్యేకం. ఈ సేవకు దేవస్థానం రూ.200 టిక్కెట్లు ఖరారు చేసి భక్తుల్ని అనుమతించారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆలయ సంప్రదాయం ప్రకారం,శాస్త్రోక్తంగా అష్టోత్తర కలశాలు ఏర్పాటు చేసారు. ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, అచ్చితా గురుకుల్‌లు పూజలు నిర్వహించారు.పది రోజుల పాటు ప్రతి రోజూ అలంకార మండపంలోనూ, స్వామి అమ్మవార్ల గర్భగుడుల ఎదురుగా వేదపండితుల వేదఘోషతో కార్యక్రమాల్ని సాగించారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఏడాది కార్తీక మాసంలో ఆలయానికి భక్తులు తండోప తండాలుగా కదలి వచ్చారు. శనివారం మూడు కాలాల తరువాత 4వ కాలము ప్రదోష కాల అభిషేకానంతరం శాస్త్రోక్తంగా ముగింపు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా స్వామి అమ్మవార్లకు అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. ఓ వైపు భక్తుల తాకిడి మరో వైపు సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. తరువాత పది రోజుల పాటు శాస్త్రోక్తంగా ఊరేగింపుగా పత్రి, కుంకుమలను మేళ తాళాలు మంగళవాయిద్యాలతో సన్నిధివీధి నుంచి జీవనది స్వర్ణముఖి నదిలోకి తీసుకెళ్ళారు. వేదపండితులు వేదమంత్రాల్ని పఠిస్తుండగా భక్తి శ్రద్దలతో నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమాల్లో డెప్యూటీఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు

## ఎడతెరపిలేని వర్షం-నీటమునిగిన పంటపొలాలు

**-ఫెంగాన్ తుఫానుతో కూలీలకు పనులు కరువు - కారాకొల్లు వాగుల్లో నీటి ప్రవాహం -పలు గ్రామాలకు రాకపోకలు బంద్**



తొట్టంబేడు, నవంబర్ 30 ప్రభాతవార్త : ఫెంగాన్ తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తొట్టంబేడు మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో సహా పలుదళిత, గిరిజనవాడలు నీటితో నిండిపోయాయి. ఎక్కడ చూసినా రోడ్లుపై నీటిప్రవాహం కనపడుతూ పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. తొట్టంబేడు మండలంలో నవంబర్ సాధారణ వర్షపాతం 291.8.3 మి.మీ ఉండగా బుధవారం సాయంత్రం 3గంటల వరకు 63.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక శనివారం శ్రీకాళహస్తి 40.2 మి.మీ, ఏర్పేడు 48.8మి.మీ. కెవిబిపురం 49.6మి.మీ, బుచ్చినాయుడుకండ్రిగ 49.8మి.మీ వర్షపాతం నమోదైంది. రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు గ్రామాల్లో ప్రజల జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. చిట్టత్తూరు చెరువు ప్రమాదస్థాయిలో ఉంది. ఇక బోనుపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న ఏరు పొంగి ప్రవహించడంతో బోనుపల్లి, కంచనపల్లి, అంజూరు, శ్రీకృష్ణాపురం గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు కాళంగిఏరులో ఎక్కువ కావడంతో పవనవారికండ్రిగ నుంచి శ్రీకాళహస్తికి వచ్చే బస్సు చిట్టత్తూరు వాగు వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో నిలిచిపోయింది. ఇక కారాకొల్లు గ్రామానికి వెళ్ళే సమీపంలో ఉన్న వాగు పొంగడంతో దొంగలముదూరు, కారాకొల్లు గ్రామాలకు రాకపోకలు లేవు. ఇక చిట్టత్తూరు నుంచి రామలింగాపురంకు వెళ్లే మార్గం వర్షపునీటితో కొట్టుకుపోవడంతో ఈమార్గంలో కూడా రాకపోకలు లేవు. ఇక మండలంలోని చిట్టత్తూరు పంచాయతీ గణపతి ఎస్టీ కాలనీ వాసులకు, పొయ్య పంచాయతీ రామానాయుడు ఎస్టీకాలనీలో నివాసం ఉంటున్న వారికి తహశీల్దార్ మధుసూధనరావు, సీనియర్ అసిస్టెంట్ నారాయణ, ఎస్ఐ ఈశ్వయ్య, విఆర్‌ఓలు విస్తృతంగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామాలు, దళితవాడల్లో పర్యటించి వారికి భోజన సదుపాయాలు కల్పించారు.